
Email : telanganaveenaoffcial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

సంపుటి : 01 సంచిక : 78 హైదరాబాద్ గురువారం 09 - 11 - 2023 పేజీలు : 06 వెల : 04




# అక్రమాల ధరణిని బంగాళాఖాతంలో కలుపుతాం




- దాని స్థానంలో కొత్త పోర్టల్
- ధరణి ముసుగులో హైదరాబాద్ పరిసరాల్లో 10వేల ఎకరాల కబ్జా
- బీఆర్ఎస్ పాలనలో కడెం, సదర్‌మాట్ ప్రాజెక్టుల నిర్లక్ష్యం
- అధికారంలోకి రాగానే ఉమ్మడి ఆదిలాబాద్ దత్తత
- లంబాడీ, ఆదివాసీల ఏకం చేస్తాం
- కాళేశ్వరం అవినీతిపై మోడీ స్పందించలేదేం..?
- ఖానాపూర్, ఆదిలాబాద్, రాజేంద్ర నగర్ సభల్లో టీపీసీసీ చీఫ్ రేవంత్



హైదరాబాద్, తెలంగాణ వీణ : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే.. అక్రమాలతో కూడిన ధరణీ పోర్టల్‌ను బరాబర్ రద్దు చేసి.. బంగాళాఖాతంలో కలుపుతామని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. దాని స్థానంలో మంచి పోర్టల్ ను అందుబాటులోకి తీసుకువచ్చి.. ఎవరికీ నష్టం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. పేదల భూములను కంప్యూటరీకరణ చేయాలని కాంగ్రెస్ నిర్ణయం తీసుకున్నదని వెల్లడించారు. ధరణి ముసుగులో కేసీఆర్ కుటుంబం హైదరాబాద్ పరిసరాల్లో పది వేల ఎకరాల భూములను కబ్జా చేసిందని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబం దోచుకున్న రంగమే తెలంగాణలో లేదన్న రేవంత్ రెడ్డి మళ్లీ వాళ్లకు అధికారం కట్టబెడితే రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి చివరకు దేశాన్ని వదిలి పారిపోతారని విమర్శించారు. బుధవారం ఖానాపూర్, ఆదిలాబాద్, రాజేంద్ర నగర్ నియోజక వర్గాలలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. అబద్ధాలు చెప్పడంలో కేసీఆర్, కేటీఆర్‌ను మించిన వారే లేరన్న ఆయన కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి తీసేస్తారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ మండి పడ్డారు. కాంగ్రెస్ లో రూ. కోట్లు ఉన్న వారికే టికెట్లు ఇస్తారని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను ఖండించిన రేవంత్ డబ్బులు లేకపోయినా బొజ్జుకు ఖానాపూర్ టిక్కెట్టు ఇచ్చింది కనిపించడం లేదా అని ప్రశ్నించారు. దొరల పాలనలో విభజించి పాలించడం ఎప్పటి నుంచో వస్తున్న అనవాయితీ అన్నారు. అందులో భాగంగానే సీఎం కేసీఆర్ ఆదివాసి లంబాడీల మధ్య మనస్పర్ధలు తెచ్చి వారిని వేరు చేశారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆదివాసీలు, లంబాడీలను ఏకం చేస్తామని, కాంగ్రెస్

మిగతా 2లో..



## హస్తం యూటర్న్!

- బెడిసికొట్టిన సర్వేలు.. పునరాలోచనలో అధిష్టానం
- అభ్యర్థుల జాబితాలో మార్పులు చేర్పులు
- నేడే లాస్ట్ ఛాన్స్
- కాంగ్రెస్ కు తప్పని రెబెల్ ముప్పు
- అసంతృప్తిలో నష్టనివారణ కమిటీ చైర్మన్..?

హైదరాబాద్, తెలంగాణ వీణ :ఎమ్మెల్యే అభ్యర్థుల విషయంలో కాంగ్రెస్ యూటర్న్ తీసుకుంది. క్షేత్రస్థాయి సర్వేలు.. అనేక భేటీలు.. సుదీర్ఘ చర్చలు.. రాజకీయ ఉద్దండుల సలహాలను పరిగణలోకి తీసుకుని మూడు దశల్లో గెలుపు గుర్రాలను ఎంపిక చేసిన హస్తం ఇప్పుడు పునరాలోచనలో పడింది. మూడు నెలల ముందు నిర్వహించిన సర్వేలే ప్రామాణికంగా జనాదరణ.. విజయవకాశాలు.. సీనియార్టీ.. నిజాయతీ కలిగిన అభ్యర్థులకే ఎమ్మెల్యే టిక్కెట్లు కేటాయిస్తామని చెప్పిన ఏఐసీసీ.. తను ఫైనల్ చేసిన జాబితాలపై తర్జనభర్జన పడుతోంది. అసంతృప్తులను బుజ్జగించేందుకు కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి నేతృత్వంలో ఏఐసీసీ ఏర్పాటు చేసిన నష్టనివారణ కమిటీ సైతం నేతల్లో నెలకొన్న అసంతృప్తికి చెక్ పెట్టలేకపోయింది. ఈ అసంతృప్తి ఎన్నికల ఫలితాలపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశాలుండడంతో అధిష్టానం జాగ్రత్తపడుతోంది. కష్టకాలంలో పార్టీకి అండగా ఉంటూ క్యాడర్‌ను కాపాడుకున్న తమకు టిక్కెట్లు ఇవ్వలేదంటూ అసంతృప్తితో ఉన్న అశావాహుల వివరాలను సేకరించింది. పోలింగ్‌కు ఇంకా 21 రోజులు

మిగతా 2లో..

# ధరని తీసేస్తే దళారుల రాజ్యమే

## మళ్లీ పైరవీకారుల రాజ్యం వస్తది

- రైతులకు భూమిపై హక్కులు పోతాయి
- ధరణిని బంగాళాఖాతంలో కలిపేస్తామంటున్నారు
- పీసీసీ చీఫ్ టికెట్లు అమ్ముకుంటున్నాడని వాళ్లే లొల్లి పెడుతున్నరు
- ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్



ఆసిఫాబాద్, తెలంగాణ వీణ: రైతుల భూములపై గతంలో అధికారులకు అధికారం ఉండేదని, ఒకరి భూమికి మరొకకరి రాసి తాకట్లు పెట్టేవారని, ఈ బాధ శాశ్వతంగా పోవాలనే తాను ధరణి పోర్టల్ తెచ్చానని సీఎం కేసీఆర్ అన్నారు. ధరణి వచ్చిన తర్వాత రైతులే కాదు.. ఎవరి భూములకు ఎలాంటి ఇబ్బందులు రావడం లేదని, ఎవరి భూమి వారికి సురక్షితంగా ఉందని, పావు గంటలో రిజిస్ట్రేషన్, పావు గంటలో పట్టా అయిపోతుందని అన్నారు. ధరణి తీసేస్తే రైతుబంధు, రైతుబీమా, ధాన్యం కొనుగోలు చేసిన డబ్బులు రావని, మళ్లీ దళారీలు వస్తారని, మళ్లా లంచాలు మొదలవుతాయని, ధరణిని బంగాళాఖాతంలో వేస్తారని కాంగ్రెస్ నేతలు చెప్పుతున్నారని, ఇది చాలా ప్రమాదమని, ధరణిని తీసేస్తే దళారి, పైరవీకారుల రాజ్యం వస్తదని, దళారుల రాజ్యం మొదలవుతుందని, రైతులు ఆగమవుతారు అని సీఎం కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ఆశీర్వాద సభల్లో భాగంగా కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్, సిర్పూర్ కాగజ్‌నగర్, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో నిర్వహించిన సభల్లో సీఎం మాట్లాడారు. ధరణి తీసేస్తామని కాంగ్రెస్ నేతలు పదేపదే చెప్తున్నారని, భూముల రిజిస్ట్రేషన్ కోసం గతంలో లంచం వసూళ్లు చేసి నెలలు తిప్పేటోళ్లని, ఇప్పుడు అధికారుల దగ్గర ఉన్న అధికారాన్ని, పెత్తనాన్ని తీసేసి, రైతుల బొటనవేలికి అధికారం ఇచ్చామని, రైతులు వారి బొటనవేలితోనే భూమి హక్కు మారుతదని అన్నారు. గతంలో వ్యవసాయం చేసుకునే కుటుంబాలకు, ఆ రైతులకు ఎవ్వరూ పిల్లను కూడా ఇవ్వకపోయేటోళ్లు అని,

మిగతా 2లో..





2లో..

## మంత్రి గంగులకు హైకోర్టులో ఊరట

## సిపిఐ అభ్యర్థి కూనంనేనికి బీసీ కులాల పోరాట సమితి మద్దతు



2లో..

## ముందుంది అసలు సినిమా

- వచ్చే ఐదేండ్లలో 24 గంటల తాగునీరు ఇస్తాం
- అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్ అధికారంలోకి రావాలి
- పారిశ్రామికవేత్తల సమావేశంలో మంత్రి కేటీఆర్


హైదరాబాద్, తెలంగాణ వీణ :ఈ తొమ్మిదిన్నరేండ్ల కాలంలో చూసింది కేవలం ట్రైలర్ మాత్రమేనని, తమ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే ఐదేండ్లలో అద్భుతాలు చూపిస్తామని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌సోమాజిగూడలోని హోటల్‌లో మల్లాపూర్, గాంధీ నగర్, జీడిమెట్ల, నాచారం, చర్లపల్లి ప్రాంతాలకు చెందిన పారిశ్రామికవేత్తలతో మంత్రి కేటీఆర్ బుధవారం

మిగతా 2లో..






'ఈటల' హెలిక్యాప్టర్ ను తనీఖీ చేసిన ఎన్నికల అధికారులు..హుజురాబాద్ ఎమ్మెల్యే, బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ హెలిక్యాప్టర్ ను బుధవారం ఎన్నికల అధికారులు తనీఖీ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రానికి ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపి నేత ఈటెల రాజేందర్ హెలికాప్టర్ ద్వారా రాగ, ఎస్పీ కిరణ్ ఖారే ఆదేశాల మేరకు సీఐ రామ్ నర్సింహారెడ్డి, ఎన్నికల అధికారి, ఎంఈఓ రఘుపతి ఆధ్వర్యంలోని ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం, హెలికాప్టర్ ను తనిఖీ చేశారు.



## కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీరింగ్ బ్లండర్

- మేడిగడ్డ పిల్లర్లు కుంగుబాటుపై సిఎం సమాధానం చెప్పాలి
- మాజీ డీజీపీ, బీజేపీ అధికార ప్రతినిధి కృష్ణ ప్రసాద్

హైదరాబాద్, తెలంగాణ వీణ : కాళేశ్వరం ప్రాజెక్టు వండర్ కాదని, ఇంజినీరింగ్ బ్లండర్ అని మాజీ డీజీపీ, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణ ప్రసాద్ ధ్వజమెత్తారు. మేడిగడ్డ ప్రాజెక్టు పిల్లర్లు కుంగుబాటుకు సిఎం కేసీఆర్ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్ లోని బీజేపీ మీడియా పాయింట్ లో కృష్ణ ప్రసాద్ మాట్లాడారు.. నీళ్ళు, నిధులు, నియామకాల కోసం పోరాడి తెలంగాణను సాధించుకున్నామని అన్నారు. 2014లో రూ. 30 వేల కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించిన ప్రాజెక్టును రీడిజైన్ పేరుతో లక్షా 30 వేల కోట్ల రూపాయలకు పెంచారని ఆయన దుయ్యబట్టారు. ఈ ఏడాది అక్టోబర్ 21న కాళేశ్వరం ప్రాజెక్టులోని ఒక బ్యారేజీ ప్రమాదకర స్థాయికి చేరుకోవడంతో రాత్రికి రాత్రే

మిగతా 2లో..

# హస్తం యూటర్న్!

మొదటిపేజీ తరువాయి..

మాత్రమే మిగిలి ఉన్నా.. ఇప్పటి వరకు ప్రకటించిన అభ్యర్థులను మార్పు చేయడం హస్తంలో కలకలం రేపుతోంది. రెండో జాబితాలో వనపర్తి నుంచి మాజీ మంత్రి చిన్నారెడ్డికి టికెట్ కేటాయించిన అధిష్టానం... మూడో జాబితాలో మాత్రం తూడి మేఘారెడ్డిని వనపర్తి అభ్యర్థిగా ప్రకటించింది. ఇటీవల పార్టీలో చేరిన నీలం మధును పఠాన్ చెరు అభ్యర్థిగా ప్రకటించిన ఏఐసీసీ... టిక్కెట్టును కాటా శ్రీనివాస్ గౌడ్ కు ఇచ్చేందుకు సిద్ధమైంది. అయితే మరోవైపు.. 119 సెగ్మెంట్లకు గానూ ఇప్పటి వరకు 117 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన ఏఐసీసీ.. వివాదస్పద తుంగతుర్తితో పాటు సీపీఎంకు కేటాయించాలనుకున్న మిర్యాలగూడ అభ్యర్థిత్వాలను పెండింగ్‌లో పెట్టింది. తుంగతుర్తి నియోజకవర్గం నుండి సీనియర్ నాయకులు అద్దంకి దయాకర్, వడ్డేపల్లి రవి, నాగరిగారి ప్రీతం,, గుడిపటి నరసయ్య దరఖాస్తు చేసుకోగా ఇటీవల కాంగ్రెస్ లో చేరిన మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు సైతం ఎమ్మెల్యే రేసులో ఉన్నారు. టీపీసీసీ, ఏఐసీసీ మోత్కుపల్లి వైపు మొగ్గు చూపతుంటే.. వడ్డేపల్లి రవి కోసం ఖమ్మం మాజీ ఎంపి పొంగులేటీ శ్రీనివాస్ రెడ్డి, ప్రీతంకు టిక్కెట్టు కోసం మాజీ మంత్రి రాం రెడ్డి దామోదర్ రెడ్డి, నల్లగొండ ఎంపి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధిష్టానంపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. దీంతో టిక్కెట్టు ఎవరికి వరిస్తుందోననే ఉత్కంఠ నెలకొన్నది. ఇటు ఇప్పటికే ఒంటరి పోరుకు సిద్ధమైన సీపీఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డిని మిర్యాలగూడ నుండి బరిలో దింపింది. దీంతో ఇప్పటికే ఆ సెగ్మెంట్ నుండి తన కుమారుడు రఘువీర్ రెడ్డికి టిక్కెట్టు డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్ సీనియర్ నేత కుందూరు జానారెడ్డి వైపు అధిష్టానం మొగ్గుచూపే అవకాశాలున్నాయి. అయితే నామినేషన్ల దాఖలుకు నేడే ఆఖరి రోజు కావడంతో ఇప్పటికిప్పుడు కొత్త స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించడం.. వారు నామినేషన్లు వేయడం దాదాపు అసాధ్యమనిపిస్తోంది. మరోవైపు.. పఠాన్‌చెరు అభ్యర్థి మార్పు అంశం పై పునరాలోచన చేస్తామంటూ సీడబ్ల్యూసీ శాశ్వత సభ్యుడు దామోదర రాజనర్సింహాకు హామీ ఇచ్చిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బుధవారం సాయంత్ర వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ఆ సెగ్మెంట్ నుండి టిక్కెట్టు ఆశించి భంగపడ్డ దామోదర ముఖ్య అనుచరులు కాటా శ్రీనివాస్ గౌడ్ రెబెల్ గా పోటీకి సిద్ధమవుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇటు పొత్తులో భాగంగా కొత్తగూడెం సీటు సీపీఐకి కేటాయించిన అధిష్టానం నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబట్టిన అక్కడి కాంగ్రెస్ ఆశావాహుడు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎడవల్లి కృష్ణ సైతం రెబెల్ గా పోటీకి సిద్ధమయ్యారు. వీరితో పాటు టిక్కెట్టు ఆశించి భంగపడి.. గాంధీభవన్ వేదికగా నిరసన దీక్షలు చేపట్టిన బెల్లయ్యనాయక్, బక్క జాక్సన్, చిన్నారెడ్డి వర్గీయులు వారి సెగ్మెంట్లలో ఏ అభ్యర్థికి మద్దతిస్తారోననే టెన్షన్ ఏఐసీసీకి పట్టుకుంది.

# కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీరింగ్ బ్లండర్

మొదటిపేజీ తరువాయి..

10 టీఎంసీల నీటిని వదిలారన్నారు. పంటల సాగు కోసం ఇవ్వాల్సిన 10 టిఎంసీల నీటిని వృథాగా వదిలేశారని ఆయన మండిపడ్డారు. రైతులకు నీళ్ళు ఇస్తామని చెప్పిన సిఎం కేసీఆర్ ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో రూ. లక్ష కోట్ల నిధులను కాజేశారని ఆయన ఆరోపించారు. రైతుల పేరు చెప్పి ఒక కుటుంబానికి నిధులు సమకూర్చుకునేందుకు కాళేశ్వరం ప్రాజెక్టును ఏటీఎంలా వాడుకున్నారని ఆయన విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో పేరుతో కొల్లగొట్టిన నిధులనే ప్రస్తుతం ఎన్నికల్లో ఖర్చు పెడుతున్నారని ఆయన ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని తప్పిదాలపై సంబంధిత ఇంజనీర్ పై ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. ప్రాజెక్టును తానే డిజైన్ చేశానని ప్రచారం చేసుకుంటున్న సిఎం కేసీఆర్ అనేక తప్పిదాలకు కారణమయ్యారని అన్నారు. దీంతో పంటలకు చుక్కనీరు అందే పరిస్థితి లేకుండా పోయిందన్నారు.

# మంత్రి గంగులకు హైకోర్టులో ఊరట

మొదటిపేజీ తరువాయి..

గంగుల ఎన్నిక చెల్లదంటూ దాఖలైన పిటిషన్ మంత్రి గంగుల కమలాకర్ కు హైకోర్టులో ఊరట లభించింది. ఆయన ఎన్నిక చెల్లదంటూ దాఖలైన పిటిషన్ ను హైకోర్టు కొట్టివేసింది. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పరిమితికి మించి మంత్రి గంగుల ఖర్చు పెట్టారని ఆరోపిస్తూ ఆయన సమీప కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై బుధవారం నాడు విచారణ జరిపిన హైకోర్టు.. ఇరువైపులా వాదనలను విన్న తర్వాత సరైన ఆధారాలు లేవంటూ పిటిషన్ కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది. అలాగే మంత్రి గంగుల ఎన్నికల చెల్లదంటూ బీజేపీ ఎంపీ బండి సంజయ్ దాఖలు చేసిన పిటిషన్ ను హైకోర్టు గురువారం విచారించనుంది.

**ప్రతిపక్షాల కుట్రలు వీగిపోయాయి - మంత్రి గంగుల**

గత ఎన్నికల్లో కరీంనగర్ ప్రజల ఆశీర్వాదంతో గెలిచిన తనపై ప్రతిపక్షాలు చేసిన కుట్రలు వీగిపోయాయని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో నామినేషన్ వేసిన రోజే హైకోర్టు తీర్పు రావడం ఆ దేవుడు సైతం తనకు అండగా ఉన్నాయని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. న్యాయమే దిక్సూచిగా ప్రజాసేవ కోసం పనిచేస్తున్న తనను కరీంనగర్ ప్రజలు ఇప్పటికే వరుసగా ఐదుసార్లు గెలిపించారని, కౌన్సిలర్ గా, కార్పోరేటర్ గా, మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలవడం వెనక ప్రజలతో తనకున్న సాన్నిహిత్యమే కారణమన్నారు. దీన్ని సహించలేని ప్రతిపక్షాలు కుట్రలతో కేసులు వేస్తే న్యాయం తన పక్షాన ఉంది కాబట్టే వీగిపోతున్నాయి అన్నారు. ఎన్నికల వ్యయమైన, మరేదైనా న్యాయాన్ని, చట్టాల్ని అత్యంత గౌరవించే వ్యక్తిగా ఎల్లప్పుడూ పాటిస్తానని అన్నారు. ఈ తీర్పుతోనైనా ప్రతిపక్షాలు తమ కుత్సిత బుద్ధి వీడి ప్రజాక్షేత్రంలో ప్రజల మన్ననలు ఉన్న తనను విమర్శించడం మానుకోవాలని అన్నారు.

# టేకాఫ్ అవ్వని ముఖ్యమంత్రి హెలికాప్టర్

తెలంగాణ వీణ , హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ హెలికాప్టర్ మొరాయించింది. బుధవారం మధ్యాహ్నం ఆయన సిర్పూర్ కాగజ్ నగర్ ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొన్నారు. అనంతరం ఆసిఫాబాద్ సభలో పాల్గొనాల్సి ఉంది. ఇందుకోసం ఆయన బయలుదేరారు. అయితే సిర్పూర్ కాగజ్ నగర్‌లో హెలికాప్టర్ టేకాఫ్ కాలేదు. దీంతో ముఖ్యమంత్రి కేసీఆర్ రోడ్డు మార్గంలో ఆసిఫాబాద్ వెళ్లారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సీఎం కేసీఆర్ జోరుగా ప్రజా ఆశీర్వాద సభలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 30న ఓటింగ్ ఉండగా, 28వ తేదీ వరకు ఆయన సభల్లో పాల్గొంటున్నారు.

# ఈసీ కీలక నిర్ణయం

తెలంగాణ వీణ , హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. వృద్ధులు, వికలాంగులు తదితర ఓటర్లతో పాటు పోలింగ్ బూత్ లకు సహాయకులుగా వచ్చేవారి చేతి వేలిపై కూడా సిరా గుర్తును వేయాలని నిర్ణయించింది. సహాయకుల కుడి చేతి చూపుడు వేలికి ఇంకు గుర్తు పెట్టాలని ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా ఓటర్లకు ఎడమ చేతి వేలిపై సిరా గుర్తు పెడతారు. పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ఏజెంట్లుగా సర్పంచ్ లు, వార్డు సభ్యులు కూర్చునే అవకాశాన్ని కూడా సీఈసీ కల్పించింది. మాక్ పోలింగ్ ను ఉదయం 5.30 గంటలకు ప్రారంభించాలని సూచించింది.

# అక్రమాల ధరణీని బంగాళాఖాతంలో కలుపుతాం

మొదటిపేజీ తరువాయి..

ప్రభుత్వానికి రెండు వర్గాలు రెండు కళ్ళ లాంటి వారిని చెప్పారు. దళిత, గిరిజనులపై కాంగ్రెస్ కు ఉన్న ప్రేమ ఏ పార్టీకి ఉండదన్నారు. ఇందిరమ్మ కంటే ముందు దళితులు, ఆదివాసీలకు ఎవరైనా భూములు ఇచ్చారా..? లేదా అనే విషయాన్ని ఆలోచన చేయాలని కోరారు. ఇందిరమ్మ హయంలో ఇచ్చిన భూములకు పట్టాలు ఇస్తామని, వాటిని అమ్ముకునే సౌకర్యం కూడా కల్పిస్తామని చెప్పారు. ఐటీడీఏ ప్రాజెక్టులు ప్రారంభించిందే కాంగ్రెస్ అనే విషయాన్ని గమనించాలన్నారు.

**తెలంగాణ వచ్చినా ఆదిలాబాద్‌కు నీళ్లు రాలే..!**

తెలంగాణ వచ్చినా ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు నీళ్లు రాలేదని రేవంత్ చెప్పారు. ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్ట్ నిర్మాణ ప్రదేశాన్ని మార్చిన కేసీఆర్.. ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రారంభించిన ప్రాణహిత ప్రాజెక్టును కేసీఆర్ దెబ్బ తీశారన్నారు. కాళేశ్వరం పేరిట రూ. లక్ష కోట్లు దోచుకున్నారని కేసీఆర్ పై ఫైర్ అయ్యారు. ఆయన ధన దాహనికి ప్రాణహిత ప్రాజెక్టు బలైందన్నారు. కాంగ్రెస్ కట్టిన కడెం, సదర్‌మాట్ ప్రాజెక్టులను కేసీఆర్ పట్టించు కోలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంటు ఉండదనే తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ నాయకులపై మండిపడ్డారు. దేశంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఆలోచన చేసిందే కాంగ్రెస్ పార్టీ అని వ్యాఖ్యానించారు. వైఎస్ హయంలో రుణమాఫీ చేశామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇచ్చినట్లు నిరూపిస్తే నామినేషన్ వెయ్యబోనన్నారు. ఉచిత విద్యుత్ పేరుతో బీఆర్ఎస్ రూ. వేల కోట్లు దోచుకుందన్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్ర ఇవ్వకపోతే కేసీఆర్, ఆయన కుమారుడు కేటీఆర్ అడుక్కు తినేవారని రేవంత్ విమర్శించారు. కాంగ్రెస్ ఏమి చేసిందని కేసీఆర్, కేటీఆర్ మాట్లాడుతున్నారన్న ఆయన కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చింది కాబట్టే కేసీఆర్, కేటీఆర్ పదవులు అనుభవిస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ దోపిడి చేయలేని రంగమే లేదన్నారు.

**గుజరాత్‌లో బీసీ సీఎం ఎందుకు లేడు..?**

తెలంగాణలో బీసీని సీఎం చేస్తామని చెబుతున్న మోదీ... ముందు గుజరాత్ లో బీసీని సీఎం చేయాలి అని చురకలు అంటించారు. నాలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలో ఉంటే ముగ్గురు బీసీలను సీఎం చేసింది..కానీ 10 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీ ఒక్క బీసీని సీఎం చేసిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బీజేపీ కి వంద స్థానాల్లో డిపాజిట్లు కూడా రావన్నారు.

**ఉమ్మడి అదిలాబాద్‌ను దత్తత తీసుకుంటా..!**

అధికారంలోకి వచ్చిన వెంటనే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకొని అన్ని రంగాల్లో అభివృద్ధి





చేస్తానని రేవంత్ హామీ ఇచ్చారు. అలాగే.. ఇంద్రవెల్లి కాల్పుల్లో చనిపోయిన అమర కుటుంబాలకు న్యాయం చేసే బాధ్యత కూడా తనదే అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిన చోట తాము ఓట్లు అడుగుతామన్న రేవంత్ రెడ్డి డబుల్ బెడ్రూం ఇండ్లు ఇచ్చిన చోటే మీరు ఓట్లు అడగాలని .ఈ సవాల్ కు బీఆర్ఎస్ సిద్ధమేనా..? అని ప్రశ్నించారు. పార్టీలో ఆశావహులు ఎందరు ఉన్నా ఒక్కరికే టికెట్ ఇవ్వగలమని, టికెట్ రాని వారిని కాంగ్రెస్ కాపాడుకుంటుందని భరోసా ఇచ్చారు. టికెట్ రాని నేతలెవరు బాధపడొద్దన్న రేవంత్ ప్రభుత్వం రాగానే సముచిత న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ గాలి వీస్తోందనీ కాంగ్రెస్ గెలిస్తేనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు.

**కాళేశ్వరంలో మోడీ మౌనమేలా..?**

ఎల్బీస్టేడియంలో జరిగిన సభలో ప్రసంగించిన ప్రధాని మోడీ కాళేశ్వరం గురించి ఎందుకు మాట్లాడలేదని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. మేడిగడ్డకు ఎందుకు పోలేదో సమాధానం చెప్పాలన్నారు. లిక్కర్ స్కాం గురించి మాట్లాడే మోడీ కాళేశ్వరం అవినీతి కన్పించలేదా అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అన్న రేవంత్ రెడ్డి బీజేపీకి ఓటేస్తే.. బీఆర్ఎస్ కు ఓటేసినట్టేనని విమర్శించారు. రాజేంద్ర నగర్ అభివృద్ధి నిధులు తేకుండా...ఇక్కడి భూములను ప్రభుత్వం అమ్ముకుంటోందని విరుచుకుపడ్డారు. దోచుకోవడానికి భూములు ఉంటాయి కానీ.. డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టించేందుకు ప్రభుత్వానికి భూమి దొరకడం లేదా అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కోకాపేటలో కాంగ్రెస్ దళితులకు ఇచ్చిన భూములను బీఆర్ఎస్ గుంజుకుందని మండిపడ్డారు. కాంగ్రెస్ విధానాల వల్లే హైదరాబాద్ నగరానికి అంతర్జాతీయ గుర్తింపు వచ్చిందన్నారు.

# ధరని తీసేస్తే దళారుల రాజ్యమే

మొదటిపేజీ తరువాయి.

ఇప్పుడు ఆ పరిస్థితి లేదు అని సీఎం తెలిపారు. ఇప్పుడు వ్యవసాయం చేస్తున్నారా..? భూమి ఉందా? అని అడిగి పిల్లను ఇస్తున్నారని అన్నారు.

**రైతుబంధు వల్ల లాభమా లేదా..?**

కేసీఆర్‌కు పని లేక ప్రజలు కట్టే ట్యాక్స్ డబ్బులను రైతుబంధు పెట్టి దుబారా చేస్తున్నారాని కాంగ్రెస్ నేతలు అంటున్నారని సీఎం కేసీఆర్ మండిపడ్డారు. రైతుబంధు దుబారా అని, రైతుబంధు వల్ల లాభం ఉందా..? నష్టం ఉందా..? ప్రజలే నిర్ణయించాలని కోరారు. వ్యవసాయానికి 24 గంటల కరెంట్ అక్కర్లేదు అని, మూడు గంటల కరెంట్ సరిపోతదని రేవంత్ రెడ్డి అంటున్నాడని, అది కూడా దుబారా అని మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉచిత విద్యుత్ ఇవ్వలేదని గుర్తు చేశారు. ఇప్పుడు రైతుల కోసం ఉచిత విద్యుత్ఇచ్చేటోళ్ల మీద నిందలు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బాగు చేసుకున్నామని, గురుకుల విద్యాసంస్థలు నెలకొల్పామని, కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేసుకుంటున్నామని సీఎం కేసీఆర్ వివరించారు. ముస్లిం, బీసీ, ఎస్సీ, ఎస్టీల కోసం గురుకులాలు పెట్టుకున్నామని, ఆ పాఠశాలలో చదువుకునే విద్యార్థుల మీద రూ. 1.20 లక్షలు ఖర్చు పెడుతున్నామని, గురుకులాల్లో చదివిన విద్యార్థులు డాక్టర్లు ,ఇంజినీర్లుగా తయారవ◌ుతున్నారు అని పేర్కొన్నారు.

**రైతులు సంతోషంగా ఉన్నారు..**

వడ్లు పండితే ఏ ఊరికి ఆ ఊర్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొంటున్నామని సీఎం కేసీఆర్ వివరించారు. రైతులకు కనీస మద్దతు ధర ఇస్తున్నామని, దళారీ రాజ్యం రాష్ట్రంలో లేదని అన్నారు. రాష్ట్రంలో పోడు పట్టాలు ఇచ్చామని, గిరిజనులపై ఉన్న కేసులు ఎత్తేశామని, వారికి కూడా రైతుబంధు ఇచ్చామని వెల్లడించారు. గిరిజనేతర బిడ్డలకు కూడా పట్టాలు వస్తాయని, దానికి ఆటంకం కేంద్ర ప్రభుత్వమే అని, కఠినమైన రూల్స్ పెట్టారని, వీటిపై లెక్కలన్నీ తీసి కేంద్రానికి పంపించామని అన్నారు. ఈ ఎన్నికల తర్వాత పోరాటం చేసి గిరిజనేతరులకు కూడా పట్టాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు.

**తెలంగాణకు అన్యాయం చేసింది కాంగ్రెస్సే**





తెలంగాణకు కాంగ్రెస్ పార్టీ తీవ్ర అన్యాయం చేసిందని, ఆ పార్టీ తీరుతో 58 ఏండ్లు గోసపడ్డామని సీఎం కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణను కాంగ్రెస్ పార్టీ నిలువునా మోసం చేసిందని, కానీ, బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల కోసం, హక్కుల కోసం పెట్టిందని వివరించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేండ్లలో ఎంత అభివృద్ధి జరిగిందో చూడాలని కోరారు. 2004లో పొత్తు పెట్టుకుంటే తెలంగాణ ఇస్తామని కాంగ్రెస్ నేతలు చెప్పారని, వారని నమ్మి కలిశామని, అప్పుడు అధికారం వచ్చిందని, తెలంగాణ వెంటనే ఇవ్వలేదని కేసీఆర్ గుర్తు చేశారు. ఏడాదికి, రెండేండ్లకు కూడా తెలంగాణ ఇవ్వలేదని, బీఆర్ఎస్ పార్టీని చీల్చే ప్రయత్నం చేశారని, 4 ఏండ్లు కొట్లాడి, కేసీఆర్ సచ్చుడో, తెలంగాణ వచ్చుడో అని ఆమరణ దీక్ష చేస్తే దిగొచ్చి తెలంగాణ ప్రకటన చేశారని, మళ్లీ ప్రకటన వెనక్కి తీసుకున్న విషయం తెలిసిందేనన్నారు. రాష్ట్రంలో చిన్న జిల్లాలు కావడంతో అభివృద్ధి జరుగుతుందని, ఆసిఫాబాద్ జిల్లా కావడంతోనే మెడికల్ కాలేజీతో పాటు వందలాది పడకలతో హాస్పిటల్ కూడా వచ్చిందని, దాంతో మన్యం బిడ్డలకు మంచి జరిగిందని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.





# ముందుంది అసలు సినిమా

మొదటిపేజి తరువాయి..

సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ గతంలో 14 రోజులకు ఒకసారి కాలనీల్లో తాగు నీరు వచ్చేదని, ప్రస్తుతం రోజు విడిచి రోజు వస్తున్నాయన్నారు. ఇది అభివృద్ధి కాదా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఇదే తమ ఆశయం కాదని, ప్రతిరోజు 24 గంటలు తాగు నీళ్లు అందివ్వాలన్నదే తమ అంతిమ లక్ష్యమన్నారు. ఇది తన వ్యక్తిగత డ్రీమ్ అని, తప్పకుండా చేసి తీరుతామని, ప్రజలు చూసి తీరుతారని కేటీఆర్ స్పష్టం చేశారు. ఇప్పటిదాకా చూసింది ట్రైలర్ అని, ఇంకా సినిమా ముందుందని పేర్కొన్నారు.

**బీఆర్ఎస్ గెలిస్తేనే**

రాష్ట్రంలో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావాలని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చినప్పుడు ఎన్నో అనుమానాలు ఉండేవని, వీరికి పరిపాలన సాధ్యమవుతుందా? అనుకున్నారన్నారు. అయితే, పదేళ్ల కిందట 10 రోజులు కరెంటు లేకపోయినా అడిగేవారు లేరు కానీ, ఇప్పుడేమో 10 నిమిషాలు కరెంటు పోతే ఇదేనా బంగారు తెలంగాణ అంటున్నారని ఎద్దేవా చేశారు. కర్ణాటక నుంచి వచ్చిన ఒకాయన మా రాష్ట్రంలో ఐదు గంటలు విద్యుత్ ఇస్తున్నామని చెబుతున్నారని, 24 గంటల కరెంటు ఇచ్చే తెలంగాణకు వచ్చి 5 గంటల



కరెంటు ఇస్తున్నాం అంటున్నారని దుయ్యబట్టారు. దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పుడు ఎన్నికల పరీక్ష ఉందని, పిల్లలకు పరీక్షలు వచ్చినప్పుడు ఎలా ఉంటుందో తమకు అలాగే ఉంటుందని అన్నారు. తాను వ్యాపారవేత్తల మద్దతు కోసం పూర్తి రాజకీయ నాయకుడుగానే వచ్చానని, పారిశ్రామికవేత్తలాగా కాకుండా ఒక్క పౌరిడిగా ఆలోచన చేయాలని, తెలంగాణ వచ్చిన తరవాత కేసీఆర్ ను ఎంత మంది ఎన్ని మాటలు అన్నారో గుర్తు చేసుకోవాలని కోరారు. ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఇక్కడకి పరిశ్రమల వస్తున్నాయని, దీంతొ స్టేబుల్ గవర్నమెంట్ ఉందని నమ్ముతున్నారని, ప్రభుత్వం స్థిరత్వం లేకపోతే ముందుగా దెబ్బతినేది పరిశ్రమలే అని అన్నారు. అధికారంలోకి వేరే వాళ్ళు వస్తే వాళ్ళు ఢిల్లీకి వెళ్లి పర్మిషన్ తీసుకోవాలని, కానీ, బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి లేకుండా పరిశ్రమలకు ప్రోత్సహం అందించిందని మంత్రి కేటీఆర్ వివరించారు. గతంలో రెండు రోజులు పాటు పవర్ హాలిడే ఉందని, కార్మికులు ఎలా బతికారో అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

**పాత కంపెనీలకు రాయితీ ఇవ్వండి**

కొత్త పరిశ్రమలకు ఇచ్చినట్లే పాత కంపెనీలకు కూడా రాయితీలు ఇవ్వాలని ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్‌ను పలువురు పారిశ్రామికవేత్తలు కోరారు. ఈ సందర్భంగా పలువురు పారిశ్రామికవేత్తలు మాట్లాడుతూ మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని, తమ డిమాండ్స్ నెరవేర్చుకోవాలని ఉందన్నారు. గతంలో ఇండస్ట్రీ నడపాలంటే చాలా ఇబ్బందిగా ఉండేదని, కానీ, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత పరిస్థితులు మారాయన్నారు. అవమానకర చర్య: రష్మిక మందన్న డీప్ ఫేక్ వీడియోపై కేటీఆర్ స్పందన మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం రావడం కోసం అందరూ కష్టపడాలని నిర్ణయించుకున్నామని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పారిశ్రామిక రంగం చాలా అభివృద్ధి చెందిందని వెల్లడించారు. విద్యుత్ సరిగా ఉండటం వల్లే అభివృద్ధి సాధ్యమవుతోందని చెప్పారు. అభివృద్ధి కావాలంటే మళ్లీ బీఆర్ఎస్ గెలవాలని ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలు అభిప్రాయపడ్డారు.

# సిపిఐ అభ్యర్థి కూనంనేనికి బీసీ కులాల పోరాట సమితి మద్దతు

కొత్తగూడెంలో కాంగ్రెస్ బలపరిచిన సిపిఐ అభ్యర్థి కూనంనేని సాంబశివ రావు కు పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు తెలంగాణలో బీసీ కులాల జాబితా నుంచి తొలగించబడిన 26 బీసీ కులాల పోరాట సమితి అధ్యక్షులు ఆళ్ళ రామకృష్ణ ప్రకటించారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ లోని మఖ్దూమ్ భవన్ లో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి ను తెలంగాణ రాష్ట్ర తొలగించబడిన 26 బీసీ కులాల పోరాట సమితి ప్రతినిధి బృందం కలసి తమ నిర్ణయాన్ని తెలియజేసారు. ఈ సందర్భంగా ఆళ్ళ రామకృష్ణ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత తరతరాలుగా తెలంగాణాలో నివసిస్తున్న ఆంధ్ర ప్రాంతానికి చెందిన అత్యంత వెనుకబడిన 26 బీసీ కులాలను సీఎం కేసీఆర్ వివక్షాపూరితంగా తెలంగాణ బీసీ కుల జాబితా నుండి తొలగించి అన్యాయం చేసారని, దీంతో విద్య, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో తీవ్రంగా నష్టపోయామని వారు తెలిపారు. తెలంగాణలోని అన్ని జిల్లాలలో గెలుపు ఓటమిలు ప్రభావితం చేసే సత్తా తొలగించిన 26 బీసీ కులాలకు ఉందని పేర్కొన్నారు. బీసీ ల హక్కులను కాలరాసి దగా చేసిన బిఆర్ఎస్ ను చిత్తుగా ఓడిస్తామన్నామని వారు హెచ్చరించారు. అధికారంలోకి వస్తే కాంగ్రెస్ పార్టీ వెంటనే తొలగించిన 26 బీసీ కులాలను తిరిగి బీసీ జాబితాలో చేరుస్తామని హామీ ఇచ్చిందని ఈ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్తి మద్దతు తెలుపుతూ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకుంటామని వారు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారంలో భాగంగా కొత్తగూడెంలో కూడా భారీ ఎత్తున ప్రచారం నిర్వహించి సిపిఐ అభ్యర్థి కూనంనేని సాంబశివ రావు గెలుపునకు కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన 26 బీసీ కులాలను తొలగించడం దారుణమన్నారు. తిరిగి చేర్చడానికి ఎన్నికల తరువాత నూతన ప్రభుత్వం సిపిఐ తరఫున ఒత్తిడి తెస్తామని తెలిపారు. కొత్తగూడెం లో సిపిఐ అభ్యర్థి కూనంనేని సాంబశివ రావు కు తెలంగాణ రాష్ట్ర తొలగించబడిన 26 బీసీ కులాల పోరాట సమితి పూర్తి మద్దతు తెలిపి, గెలుపునకు కృషి చేస్తామని ప్రకటించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి పివివి. సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ఏంఆర్కె. రెడ్డి, చొల్లంగి ప్రసాద్, సంయుక్త కార్యదర్శి చిత్తూరు వేణు, రాష్ట్ర కార్యవర్గసభ్యులు జె. వెంకటేశ్వర్ రావు, మురళీధర్, టి. శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.



## మహిళా అధికారి హత్య కేసులో మాజీ డ్రైవర్ అరెస్టు




తెలంగాణ వీణ , జాతీయం : కర్ణాటకా అధికారి కేఎస్ ప్రతిమ(43) హత్య కేసులో అమె వద్ద డ్రైవర్‌గా పనిచేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. పనిలో నుంచి తీసేసిన కక్షతోనే నిందితుడు ఈ ఘటనకు పాల్పడినట్లు తెలుస్తోంది. నిందితుడు నేరాన్ని కూడా అంగీకరించినట్లు సమాచారం.

నిందితుడు కిరణ్ గత ఐదేళ్లుగా గవర్నమెంట్ కాంటాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అధికారి ప్రతిమ గత పది రోజుల క్రిందటే కిరణ్‌ను విధుల నుంచి తప్పించారని వెల్లడించారు. అతని స్థానంలో మరో ఉద్యోగిని నియమించుకున్నట్లు తెలిపిన పోలీసులు.. ఈ కక్షతోనే నిందితుడు ప్రతిమను హత్య చేశారని అనుమానిస్తున్నారు. హత్య అనంతరం బెంగళూరు నుంచి దాదాపు 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న చామరాజనగర్‌కు పారిపోయినట్లు గుర్తించారు.

కర్ణాటకాలో గనులు, భూవిజ్ఞాన శాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా సేవలు అందిస్తున్న కేఎస్ ప్రతిమ(43) శనివారం రాత్రి దారుణ హత్యకు గురయ్యారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ దారుణ హత్య జరిగింది. శనివారం రాత్రి ఎనిమిది గంటలకు కార్యాలయం నుంచి ఇంటికి ప్రతిమను కారులో డ్రైవరు డ్రాప్ చేసి వెళ్లాడు. కాసేపటికే ప్రతిమపై దాడి చేసిన కొందరు వ్యక్తులు.. ఆమెను హత్య చేసి అక్కడి నుంచి పారిపోయారు.

## పోలీసు విచారణలో నిందితుని ట్విస్ట్!




తెలంగాణ వీణ , జాతీయం : బీహార్ రాజధాని పట్నా రైల్వే స్టేషన్‌లో ఆ సమయంలో కలకలం చెలరేగింది. రాజధాని, జన-శతాబ్ది, వందే భారత్ రైళ్లను పేల్చివేస్తామంటూ రైల్వే అధికారులకు బెదిరింపు లేఖ వచ్చింది. రాజేంద్ర నగర్ టెర్మినల్ స్టేషన్ మేనేజర్‌కు ఆగంతకుడు ఈ బెదిరింపు లేఖను పోస్ట్ ద్వారా పంపాడు.

తాను ఈ మూడు రైళ్లను పేల్చకుండా ఉండాలంటే రైల్వే శాఖ తనకు రూ.1.5 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో ఈ విషయాన్ని స్టేషన్ మేనేజర్.. జీఆర్పీకి, స్థానిక పోలీసులకు తెలియజేశారు. ఈ కేసులో పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తి మరొకరిని ఈ కేసులో ఇరికించాలని ఒక పథకం ప్రకారం స్టేషన్ మేనేజర్‌కు బెదిరింపు లేఖ పంపాడు.ఈ కేసులో కామత్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులకు కామత్ విస్తుపోయే వివరాలను వెల్లడించాడు. కపిల్ దేవ్ అనే వ్యక్తిని ఇబ్బంది పెట్టాలని, పోలీసు కేసులో ఇరికించాలనే ఉద్దేశంతో కామత్ ఈ బెదిరింపు లేఖ రాశాడని పోలీసుల విచారణలో తేలింది. కామత్, కపిల్ దేవ్ మధ్య చాలా కాలంగా భూ వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో కామత్ జైలుకు కూడా వెళ్లాడు. జైలు నుంచి విడుదలైన అతను కపిల్‌దేవ్‌పై పగ తీర్చుకునే ఉద్దేశంతో ఈ పనిచేశాడని పోలీసులు తెలిపారు.

## నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు సీఎం దీపావళి బొనంజా



తెలంగాణ వీణ , జాతీయం : గ్రూప్-బి, సి నాన్‌గెజిటెడ్ ఉద్యోగులకు అరవింద్ కేజ్రీవాల్ సారథ్యంలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం దీపావళి కానుక ప్రకటించింది. ఉద్యోగులకు రూ.7,000 చొప్పున దీపావళి బోనస్ ఇస్తున్నట్టు ప్రకటించింది.

"గ్రూప్ బి నాన్ గెజిటెడ్, గ్రూప్ సి ఉద్యోగులకు రూ.7,000 చొప్పున బోనస్ ఇస్తున్నాం. ప్రస్తుతం ప్రభుత్వంలో 80,000 మంది గ్రూప్ బి, సి ఉద్యోగులు పని చేస్తున్నారు. బోనస్ కింద రూ.56 కోట్లు వెచ్చిస్తున్నాం" అని ఒక వీడియో సందేశంలో సీఎం కేజ్రీవాల్ తెలిపారు. విద్య, ఆరోగ్యం, మౌలిక వసతుల కల్పన, ప్రజాసేవల రంగంలో గత ఎనిమిదేళ్లుగా ఢిల్లీ ప్రభుత్వం ఎన్నో గొప్ప పనులు చేసిందని, ఇందులో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర గణనీయమైనదని చెప్పారు. ఉద్యోగుల అంకితభావం, కఠోర శ్రమతో ఢిల్లీని డ్రీమ్ సిటీగా చేయగలిగామని ప్రశంసించారు. కాగా, ఆప్ ప్రభుత్వం నవంబర్ 1న మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ (ఎంసీడీ)లో పనిచేసే 5000 మంది పారిశుధ్య కాంట్రాక్టు ఉద్యోగులను పెర్మనెంట్ చేశారు. ఇంతవరకూ 6,494 పారిశుధ్య కార్మికుల ఉద్యోగాలను పెర్మనెంట్ చేశామని, ప్రభుత్వ నిర్ణయంతో వేలాది కుటుంబాల్లో ముందే దీపావళి వచ్చిందని కేజ్రీవాల్ ఇటీవల ప్రకటించారు.

# గవర్నర్ల తీరుపై సుప్రీంకోర్టు అసంతృప్తి



తెలంగాణ వీణ , జాతీయం : రాష్ట్ర శాసనసభ ఆమోదం పొందిన బిల్లులను ఎటూ తేల్చకుండా వాటి విషయంలో గవర్నర్లు నాన్చివేత ధోరణిని అవలంబిస్తున్నారని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. ఇలాంటి సంస్కృతికి ముగింపు పలకాలని సూచించింది. పంజాబ్‌అసెంబ్లీ ఆమోదించిన బిల్లుల విషయంలో గవర్నర్ బన్వరీలాల్ పురోహిత్ ఎటూ తేల్చకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. "రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం పొందిన బిల్లుల విషయంలో గవర్నర్లు తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలి. సుప్రీంకోర్టు వరకు ఈ విషయాల్ని లాగొద్దు. గవర్నర్లు ఆత్మపరిశీలన చేసుకోవాలి. వారు ప్రజాప్రతినిధులు కాదు" అని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం, పంజాబ్ గవర్నర్ తీసుకున్న చర్యలపై తాజా స్థితి నివేదికను సమర్పించాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఆదేశించింది.

అనంతరం ఈ కేసును శుక్రవారానికి వాయిదా వేసింది. ఆమ్ ఆద్మీ పార్టీ నేతృత్వంలోని ప్రభుత్వ హయాంలో పంజాబ్ అసెంబ్లీ ఆమోదించిన 27 బిల్లుల్లో 22 బిల్లులకు పురోహిత్ ఆమోదం తెలిపారు. చాలా రాష్ట్రాల్లో సీఎంకు గవర్నర్ లకు ఉన్న వైరంలాగే పంజాబ్ సీఎం భగవంత్ మాన్ ప్రభుత్వానికి, గవర్నర్‌కు మధ్య వైరం నెలకొంది. ఇటీవలే పంజాబ్ అసెంబ్లీ ఆమోదించిన బిల్లుల ఆమోదానికి గవర్నర్ తాత్సారం చేయడంతో ప్రభుత్వం సుప్రీంను ఆశ్రయించింది. నవంబర్ 1న, పురోహిత్.. భగవంత్ మాన్‌కు లేఖ రాసిన కొన్ని రోజుల తర్వాత, మూడు ద్రవ్య బిల్లులలో రెండింటికి ఆమోదం తెలిపారు. సభలో ద్రవ్య బిల్లులు పెట్టాలంటే గవర్నర్ ఆమోదం తప్పనిసరి. అయితే, అక్టోబరు 19న సీఎంకు రాసిన లేఖలో గవర్నర్ మూడు ద్రవ్య బిల్లుల ఆమోదాన్ని నిలిపేశారు.

## 1,25,000 ఏండ్లల్లో.. ఇదే వార్మెస్ట్ ఇయర్

తెలంగాణ వీణ , న్యూఢిల్లీ: ఈ ఏడాది వాతావరణం వేడెక్కిన విషయం తెలిసిందే. అంతటా అధిక స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఇక గడిచిన 1,25,000 ఏండ్లల్లో.. ఈ ఏడాదే అత్యధిక ఉష్ణోగ్రత(Warmest Year)లు నమోదు అయినట్లు యురోపియన్ యూనియన్ శాస్త్రవేత్తలు తెలిపారు. అక్టోబర్‌లో నమోదు అయిన ఉష్ణోగ్రతల ఆధారంగా శాస్త్రవేత్తలు అంచనా వేశారు. 2019లో నమోదు అయిన ఉష్ణోగ్రతలతో పోలిస్తే ఈ ఏడాది 0.4 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదు అయినట్లు ఈయూ కోపర్‌నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీస్ డైరెక్టర్ సమంత బర్జెస్ పేర్కొన్నారు. అక్టోబర్‌లో టెంపరేచర్లు అసాధారణంగా ఉన్నట్లు తెలిపారు.1850 నుంచి 1900 మధ్య ప్రపంచవ్యాప్తంగా వాయు ఉష్ణోగ్రతలను పోలిస్తే .. ఈ ఏడాది అక్టోబర్‌లో 1.7 డిగ్రీల సెల్సియస్ పెరిగినట్లు భావిస్తున్నారు. పారిశ్రామీకరణకు ముందు ఉన్న వాతావరణంతో ప్రస్తుత అంచనా వేశారు. దీంతో 2023ని హాటెస్ట్ ఇయర్‌గా పేర్కొన్నారు. కోపర్నికస్ డేటా సెంటర్ 1940 నుంచి అందుబాటులో ఉన్నది. ఇక యూఎన్ ఇంటర్ గవర్నమెంటల్ ప్యానల్ ఆన్ క్లైమెట్ చేంజ్ ఇచ్చిన డేటా ప్రకారం.. గడిచిన 1,25,000 ఏండ్లల్లో.. ఈ ఏడాది హాటెస్ట్ ఇయర్‌గా నమోదు అయినట్లు తెలుస్తోంది.గ్రీన్‌హౌజ్ వాయువులతో పెరుగుతున్న ఉష్ణోగ్రత లకు.. ఎల్‌నినో తోడవ్వడం వల్లే .. ప్రపంచవ్యాప్తంగా టెంపరేచర్లు రెట్టింపు అవుతున్నట్లు పెన్సిల్వేనియా వర్సిటీ శాస్త్రవేత్త మైఖేల్ మాన్ తెలిపా రు. అతి తీవ్రమైన వెదర్ వల్ల లిబియా లాంటి ప్రదేశాల్లో విధ్వంసకర రీతిలో వరదలు వస్తున్నాయి. దక్షిణ అమెరికా, కెనడాల్లో హీట్‌వేవ్‌కు కూడా ఇదే కారణం అవుతోంది.

### అంబులెన్స్ లేకపోవడంతో.. సోదరి మృతదేహాన్ని

## బైక్‌పై తీసుకెళ్లిన యువకుడు




తెలంగాణ వీణ , లక్నో: అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో ఒక యువకుడు సోదరి మృతదేహాన్ని బైక్‌పై తీసుకెళ్లాడు. బాధను తట్టుకోలేక అతడు ఏడుస్తూ సోదరి మృతదేహాన్ని బైక్‌పై ఎక్కించి తీసుకెళ్లిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని ఆరయాలో ఈ సంఘటన జరిగింది. బుధవారం బిధునా ప్రాంతానికి చెందిన ఒక యువతి వాటర్ హీటర్ రాడ్ వల్ల విద్యుతాఘాతానికి గురైంది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. అయితే పరిశీలించిన డాక్టర్లు ఆ యువతి చనిపోయిందని చెప్పారు.కాగా, ఆశ వీడని సోదరుడు తన సోదరిని మరో ఆసుపత్రికి తీసుకెళ్లాలని భావించాడు. అయితే అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో తన బైక్‌పై తీసుకెళ్లాడు. ఆ యువకుడు ఏడుస్తూ చనిపోయిన సోదరిని తన బైక్‌పై తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో వైద్య సౌకర్యాల కొరతపై ప్రతిపక్ష పార్టీలు మండిపడ్డాయి.

## ప్రమాదస్థాయిలో వాయు కాలుష్యం..



తెలంగాణ వీణ , జాతీయం : దేశ రాజధాని ఢిల్లీ కాలుష్యం కోరల్లో చిక్కుకుంది. రోజురోజుకీ వాయు నాణ్యత దారుణంగా పడిపోతుంది. మితిమీరిన కాలుష్యంతో నగర వాసులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. నగరాన్ని పొగ మంచు కమ్మేసింది. గత నాలుగు రోజులు కాలుష్యం ప్రమాదకర స్థాయిలోనే కొనసాగుతోంది. కాలుష్యం తీవ్ర స్థాయికి చేరడంతో వాయు నాణ్యత సూచీలు క్రమేపీ క్షీణిస్తున్నాయి. సోమవారం వాయు నాణ్యత సూచి(ఏక్యూఐ) 437కు చేరిందని కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు వెల్లడించింది.ఈ క్రమంలో కాలుష్య నియంత్రణకు ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీలో మరోసారి సరి– బేసి విధానాన్ని అమలు చేయనున్నట్లు రాష్ట్ర పర్యావరణశాఖ మంత్రి గోపాల్ రాయ్ వెల్లడించారు. నవంబర్ 13 నుంచి 20 వరకు ఈ విధానం అమల్లో ఉండనున్నట్లు పేర్కొన్నారు. ఈ విధానం ప్రకారం.. వాహన రిజిస్ట్రేషన్ నంబరు చివర సరి సంఖ్య ఉన్న వాహనాలు ఒక రోజు, బేసి సంఖ్య ఉన్న వాహనాలు మరో రోజు రోడ్లపైకి రావాల్సి ఉంటుంది.ఈ మేరకు దేశ రాజధానిలో కాలుష్య సంక్షోభంపై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలో పర్యావరణవాఖ మంత్రి గోపాల్ రాయ్ సోమవా రం సంబంధిత అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలోనే సరి–బేసిపై నిర్ణయం తీసుకున్నారు. అంతకముందు వెల్లడించిన దాని ప్రకారం BS3 పెట్రోల్, BS4 డీసిల్ కార్లను నిషేధం సైతం కొనసాగుతుందని మంత్రి గోపాల్ రాయ్ తెలిపారు.

## సీఐసీగా హీరాలాల్ ప్రమాణస్వీకారం



తెలంగాణ వీణ , జాతీయం : ప్రధాన సమాచార కమిషనర్‌గా హీరాలాల్ సమరియా సోమవారంనాడు ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తాజా నియామకంతో సీఐసీగా బాధ్యతలు చేపట్టిన తొలి దళిత వ్యక్తిగా హీరాలాల్ సమారియా నిలిచారు.

సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమిషన్ స్టేట్ ఇన్ఫర్మేష్ కమిషన్లలో (ఎస్ఐసీలు) ఖాళీలను భర్తీ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో తాజా నియామాకం జరిగింది. ఖాళీలు భర్తీ చేయని పక్షంలో ఆర్టీఐ చట్టం–2005కు జీవం లేనట్టేనని సీజేఐ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జేబీ పర్దివాలా, మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం అభిప్రాయం వ్యక్తం చేసింది.


## నామినేషన్ వేసిన సీఎం

తెలంగాణ వీణ , జాతీయం : రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి కాంగ్రె స్ పార్టీ సీనియర్ నేత, ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ సోమవారంనాడు నామినేషన్ దాఖలు చేశారు. సదర్‌పుర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆయన నామినేషన్ వేశారు. గెహ్లాట్ వెంట ఆయన కుమారుడు వై భవ్ గెహ్లాట్ నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. నామినేషన్ వేసే ముందు గెహ్లాట్ తన సోదరి ఆశీస్సులు తీసుకున్నారు. 1998 నుంచి సద ర్‌పర నియోజకవర్గం గెహ్లాట్‌కు కంచుకోటగా ఉంది. 2018 అసెంబ్లీ ఎ న్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి 63 శాతం ఓట్లు ఆయన గెలుచుకున్నారు.

ప్రధాన్ సేవక్ (సీఎం)గా తన బాధ్యతలను తాను సక్రమంగా నిర్వర్తించానని, తన అనుభవాన్ని ప్రజాసేవకే వినియోగించానని చెప్పారు. ఇక నిర్ణయం తీసుకోవాల్సింది ప్రజలేనని గెహ్లాట్ అన్నారు. రాజస్థాన్‌లో కాంగ్రెస్ హవా కనిపిస్తోందని, తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని ప్రజలు అనుకుంటున్నారని చెప్పారు. "గతంలో రాజస్థాన్ వెనుకబడిన రాష్ట్రంగా ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. ఇవాళ రాజస్థాన్‌లో ఎయిమ్స్, ఐఐటీలు, ఐఐఎంఎస్‌లు, ఇతర యూనివర్శిటీలు వచ్చాయి. నేను మొదటిసారిగా సీఎం అయినప్పుడు కేవలం 6 యూనివర్శిటీలు రాజస్థాన్‌లో ఉండేవి. ఇప్పుడు 100కు పైగా కాలేజీలు ఉన్నాయి. కాంగ్రెస్‌నే అధికారంలోకి తీసుకురావాలనే ఆలోచనలో ప్రజలు ఉన్నారు" అని గెహ్లాట్ చెప్పారు

కాంగ్రెస్ సీనియర్ నేత అయిన గెహ్లాట్ 2018 నుంచి సీఎంగా ఉన్నారు. తొలుత 1998 నుంచి 2003 వరకూ సీఎంగా పనిచేశారు. తిరిగి 2008 నుంచి 2013 వరకూ సీఎంగా ఉన్నారు.1999లో సదర్‌పుర నియోజకవర్గం ఉప ఎన్నికల్లో గెలిచిన ఆయన ఆ తర్వాత కూడా అదే నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చారు. 2003, 2008, 2013, 2018లో ఇక్కడి నుంచే గెలిచారు. 2018 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి శంభు సింగ్ ఖెటసర్‌పై 45 వేల పైచిలుకు ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. 1985, 1994, 1997లో రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్‌గా ఆయన ఉన్నారు. 1982లో ఇందిరాగాంధీ ప్రభుత్వంతో పర్యాటక, పౌరవిమానయాన, క్రీడల శాఖ డిప్యూటీ మినిస్టర్‌గా, రాజీవ్ గాంధీ హయాంలో టూరిజం, సివిల్ ఏవియేషన్ శాఖ సహాయమంత్రిగా, పీవీ నరసింహారావు హయాంలో జౌళి శాఖ సహాయ మంత్రి (ఇండిపెండెంట్ చార్జ్)గా పనిచేశారు. 1990, 1993 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి తర్వాత 1998లో గెహ్లాట్ నాయకత్వంలో కాంగ్రెస్ భారీ విజయం సాధించింది.

## ఇదేందయ్యా ఇది? నేను ఎప్పుడూ చూడలే




తెలంగాణ వీణ , జాతీయం : ప్రపంచంలో అణువణువునా ఆహార ప్రియులు కనిపిస్తారు. ఈ ఫుడ్ లవర్స్ కారణంగానే కొత్త ప్రయోగాలతో వినూత్న ఆహారాలు పుట్టుకొస్తుంటాయి సోషల్ మీడియాలో వంటల ప్రయోగాలకు సంబంధించిన వీడియోలు లెక్కలేనన్ని కనిపిస్తాయి. తాజాగా ఒక వీడియో హల్‌చల్ చేస్తోంది. ఒక మహిళ ఉడికించిన బంగాళ దుంపలు, బిస్కెట్లు కలిపి వినూత్న రీతిలో పకోడీలు తయారు చేసింది. ఈ వీడియో చూసిన వారంతా రకరకాల కామెంట్లు చేస్తూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. వీడియో మొదట్లో ఆ మహిళ పకోడీల తయారీకి వినియోగించే శనగపిండిలో బిస్కెట్లను ముంచడాన్ని గమనించవచ్చు. ఆ తరువాత వాటిని ఆమె వేడి నూనెలో వేయిస్తుంది. అయితే వీడియోలో ఇక్కడే ట్విస్ట్ ఉంది. ఆమె ఈ బిస్కెట్ పకోడీలను వేయించడానికి ముందు.. మొదటగా బంగాళాదుంపలను ఉడకబెట్టి మెత్తగా చేస్తుంది. దానికి వేయించిన మసాలా దినుసులు కలుపుతుంది.

## ఆరె, మాలి కులస్తుల సంక్షేమం కోసం కృషి చేస్తాం



తెలంగాణ వీణ , ఆసిఫాబాద్ : ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ నియోజకవర్గం పరిధిలో ఉన్న ఆరె, మాలి కులస్తుల సంక్షేమం కోసం కృషి చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని కోవా లక్ష్మికి మద్దతుగా ప్రసంగించారు.బీఆర్ఎస్ గవర్నమెంట్‌లో ఆసిఫాబాద్‌లో 47 వేల ఎకరాలకు పోడు పట్టాలు ఇచ్చాం. వారందరికీ రైతుబంధు ఇచ్చాం. రైతుబీమా కూడా పెట్టుకున్నాం. కాగజ్‌నగర్‌లో ఇద్దరు గిరిజనులు చనిపోతే రూ. 5 లక్షల చొప్పున బీమా అందిందని కోనేరు కోనప్ప చెప్పారు. ఆదివాసీ, లంబాడీ తండాలకు త్రీ ఫేజ్ కరెంట్ సదుపాయం కూడా కల్పిస్తున్నాం. ఇంకా మిగిలి ఉంటే అది కూడా పూర్తువుతుంది అని కేసీఆర్ పేర్కొన్నారు.

**బీఆర్ఎస్ ప్రభుత్వానికి కులం, మతం లేదు..**

గిరిజనుల కోసం పోడు పట్టాలు ఇచ్చాం. ఈ నియోజకవర్గంలో ఆరె, మాలి కులస్తులు ఉన్నారు. ఆరె కులస్తులకు ఓబీసీ కావాలని అడుగుతున్నారు. అది రావడం లేదు. తప్పకుండా దాని గురించి ఫైట్ చేసి, వారి సంక్షేమాన్ని పట్టించుకుంటాం. మాలి కులస్తుల విషయంలో మేం తీర్మానం చేసి పంపించాం.. కానీ కేంద్రం పట్టించుకోవడం లేదు. మాలి కులస్తులు కాగజ్‌నగర్, ఆసిఫాబాద్‌లో ఉన్నారు. ప్రత్యేక డబ్బులు వెచ్చించి వారి సంక్షేమం కోసం కృషి చేస్తాం. బీఆర్ఎస్ ప్రభుత్వానికి కులం లేదు, మతం లేదు.. జాతి లేదు. అందర్నీ కలుపుకుపోతున్నాం అని కేసీఆర్ తెలిపారు.

**కాంగ్రెస్‌కు అధికారం అప్పగిస్తే.. మళ్లీ పట్వారీలు, దళారీల రాజ్యం వస్తది.**

మునపటి లాగా కల్తీ నీళ్లు తాగి మరణాలు లేవు. గిరిజనుల లభివృద్ధి చేసుకుంటున్నాం. గిరిజన బిడ్డల కోసం గురుకులాలు పెట్టుకున్నాం.. పిల్లలు చక్కగా చదువుకుంటున్నారు. ఎంబీబీఎస్, ఇంజినీరింగ్‌లో సీట్లు వస్తున్నాయి. ఈ అభివృద్ధి కార్యక్రమాలు జరగాలంటే బీఆర్ఎస్ గవర్నమెంట్ రావాలి. కాంగ్రెస్‌కు అప్పగిస్తే రైతుబంధు రాంరాం.. పట్వారీలు, దళారీల రాజ్యం వస్తది. ఆగమైపోయే అవకాశం ఉంటుంది. అబివృద్ధి చెందుతున్న తెలంగాణ ఇదే విధంగా అబివృద్ధి చెందాలి కాబట్టే కోవా లక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపించాలి. ఆత్రం సక్కుకు లభించే స్థానం లభిస్తుంది. ఇటీవల పార్టీలో చేరిన సరస్వతికి రాజకీయ భవిష్యత్ ఇస్తానని హామీ ఇస్తున్నా అని చెబుతూ కేసీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు.

## ఆసిఫాబాద్ జిల్లా కావడంతో.. మన్యం బిడ్డలకు మంచి జరిగింది



తెలంగాణ వీణ , ఆసిఫాబాద్ : ఆసిఫాబాద్ జిల్లా కావడంతోనే.. మెడికల్ కాలేజీతో పాటు వందలాది పడకలతో హాస్పిటల్ కూడా వచ్చిందని, దాంతో మన్యం బిడ్డలకు మంచి జరిగిందని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని కోవా లక్ష్మికి మద్దతుగా ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం కాకపోతే ఆసిఫాబాద్ జిల్లా కాకపోయేది. ఎన్నో ప్రయత్నాలు చేసినా ఎవరూ కూడా జిల్లా చేయలేదు. మారుమూల ప్రాంతం ఆసిఫాబాద్ జిల్లా అయితదని కలలో కూడా ఎవరూ అనుకోలేదు. కానీ ఇవాళ బీఆర్ఎస్ గవర్నమెంట్ ఉంది కాబట్టి, గిరిజన బిడ్డలకు, పేద వర్గాలకు న్యాయం జరగాలని జిల్లా చేశాం. మీరందరూ చూస్తుండగానే కలెక్టరేట్, ఎస్పీ ఆఫీసు కట్టుకున్నాం. నేనే ప్రారంభించాను. ఆసిఫాబాద్ జిల్లా కావడంతో ఒక మంచి మేలు జరిగింది. వర్షాకాలం వచ్చిందంటే గుట్ట మీద గూడెం, గుట్ట కింద వాగుల నీళ్లు.. ఆ కలుషిత నీళ్లు తాగి అంటురోగాలు వచ్చేవి. గిరిజన బిడ్డలు రోగాల బారిన పడేవారు. మంచం పట్టిన మన్యం అని వార్తలు వచ్చేవి. ఇవాళ ఆ బాధ పోయింది. ఆసిఫాబాద్‌లో మెడికల్ కాలేజీ వస్తదని ఎవరూ అనుకోలేదు. మెడికల్ కాలేజీతో పాటు వందలాది పడకల హాస్పిటల్ కూడా రావడంతో మన్యం బిడ్డలకు మంచి జరిగింది అని కేసీఆర్ తెలిపారు. తెలంగాణ కోసం పోరాటం చేసిన మహాయోధుడు.. జల్, జంగల్, జమీన్ నినాదంతో కొట్లాడిన మహాయోధుడు మన కొమ్రం భీం. ఆయన పేరు మీద కొమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అని నామకరణం చేశాను. ఈ విషయం మీ అందరికీ తెలుసు. కొమ్రం భీం పోరాటం చేసిన స్థలంలో కెరెమెరి ఘాట్స్‌ను ఏ గవర్నమెంట్ కూడా పట్టించుకోలేదు. 2014 తర్వాత బీఆర్ఎస్ గవర్నమెంట్ వచ్చిన తర్వాత స్వయంగా నేనే అక్కడికి వెళ్లి.. కొమ్రం భీం స్మారక చిహ్నం నిర్మాణం చేసుకున్నాం. ఇవన్నీ మీ కండ్ల ముందున్నాయి.. జరిగాయి అని కేసీఆర్ తెలిపారు.

# మల్కాజిగిరిలో మంచితనానికి... రౌడీయిజానికి మధ్య పోటీ

**నాడు మల్లారెడ్డి చేతిలో ...**
**నేడు మర్రి రాజశేఖర్ రెడ్డి చేతిలో**
**ఓటిమి ఖాయం ... మంత్రి హరీష్ రావు**



తెలంగాణవీణ, మల్కాజిగిరి ; మల్కాజిగిరి ని దత్తత తీసుకుని అభివృద్ధికి కృషి చేస్తానని, మర్రి రాజ శేఖర రెడ్డిని గెలిపిస్తే మరింత వేగంగా అభివృద్ధి చేస్తానని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. బుధవారం మల్కాజిగిరి నియోజకవర్గంలో మంత్రి హరీశ్ రావు సమక్షంలో బిజెపికి నాయకులు జీకే హన్మంత రావు, జీకే శ్రీదేవితో పాటు పలువురు , ఇతర నాయకులు భారాసలో చేరారు. విద్యావంతుడు, పేదల గురించి ఆలోచన చేసే మర్రి రాజశేఖర్ రెడ్డి ని మెజార్టీ తో గెలిపించాలని కోరారు. రాష్ట్ర ముఖ్య మంత్రి కేసిఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. కేసీఅర్ ని మూడోసారి ముఖ్యమంత్రి చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలకు తాగునీటి కష్టాలు, కరెంటు బాధలు, కర్ఫ్యూ లేకుండా అభివృద్ధే లక్ష్యంగా కేసీఆర్ నిరంతరం ప్రజల కోసమే పనిచేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఆసరా పెన్షల పెంపు, రేషన్ షాపుల్లో సన్నబియ్యం, రూ.400 కే వంట గ్యాస్ వంటి సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందించనున్నామని ప్రజలంతా గ్రహించి కాంగ్రెస్, బీజేపీల మాయమాటలను నమ్మి మోసపోవద్దనీ, బీఅర్ఎస్ నే గెలిపించాలన్నారు. మల్కాజిగిరిలో మంత్రి మల్లారెడ్డి చేతిలో ఏంపీగా ఓడిన మైనంపల్లి హన్మంతరావు నేడు మర్రి రాజశేఖర్ రెడ్డి చేతిలో ఓడిపోవటం ఖాయమన్నారు.

**దీపావళి పండుగ ముందుగానే వచ్చేసింది- మంత్రి మల్లారెడ్డి**

మైనంపల్లి ఒక్క రోజుకూడ అసెంబ్లీకి రాలేదు మల్కాజిగిరి ప్రజలకు ముందుగానే దీపావళి పండుగ వచ్చిందనీ, రాక్షస పాలన నుంచి విముక్తి లభించిందని రాష్ట్ర కార్మిక ఉపాధిశాఖ మంత్రి సీహెచ్ మల్లారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మైనంపల్లి హన్మంతరావుపై మండిపడ్డారు. ఎమ్మెల్యేగా ఏ ఒక్క రోజు అసెంబ్లీకి రాలేదని, రూ. ఆరు కోట్ల ఎమ్మెల్యే నిధులు వెచ్చించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శించారు. మైనంపల్లి 30 ఏళ్ల రాజకీయం ఇంతేనాననీ, విధి రాతను ఎవ్వరు తప్పించలేరన్నారు. పూర్వంలో పాపం చేస్తే తమ కుటుంబానికి తగిలేదనీ, నేటి కలియుగంలో మాత్రం చేసిన పాపం వెంటనే తగులుతోందన్నారు. మల్కాజిగిరి ప్రజల ఉసురు మైనంపల్లికి తగులుతోందనీ, కాంగ్రెస్ పార్టీలో మొట్టమొదటిగా ఓడేది మైనంపల్లేనన్నారు. అతనికి డిపాజిట్ కూడా దక్కదన్నారు. మల్కాజిగిరిలో ఉన్న బయం నుంచి బయట పడాలంటే బీఆర్ఎస్ ను గెలిపించాలని అభ్యర్థించారు. పార్టీ కార్యకర్తలు , నాయకులు సైనికుల్లా పనిచేసి మైనంపల్లిని ఓడించాలని కోరారు. మల్కాజిగి రిలో తనను అశిర్వదించి గెలిపిస్తే అందరికీ అందుబాటు లో ఉంటూ నిస్వార్థంగా సేవలందిస్తానని మర్రి రాజశేఖర్ రెడ్డి కోరారు. ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, ఎంబీసీ ఛైర్మన్ నందికంటి శ్రీధర్, జీకే హన్మంత రావు, శ్రీదేవి, మదుసూధన్ రెడ్డి, జితేం దర్ రెడ్డ, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, ఎంబీసీ ఛైర్మన్ నందికంటి శ్రీదర్, మీనాఉపేందర్ రెడ్డి, శాంతి శ్రీనివా స్ రెడ్డి, నందా రెడ్డి, పార్టీలో చేరిన జీకేహన్మంతరావు, శ్రీదేవి, మధసూధన్ రెడ్డి,మీనాఉపేందర్ రెడ్డిలతో పాటు కార్పొ రేర్లు,ఉద్యమనాయకులు,పార్టీనాయకులు పాల్గొన్నారు.

## ఉప్పల్ కాంగ్రెస్ అభ్యర్థికి సీపీఐ సంపూర్ణ మద్దతు

**సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు**
**వి. ఎస్. బోస్**




తెలంగాణవీణ, కాప్రా; ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మందుముల పరమేశ్వర్ రెడ్డికి సీపీఐ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఎన్నికల ప్రచారంలో ముమ్మరంగా పాల్గొంటామని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. ఎస్. బోస్ తెలిపారు. సీపీఐ ఉప్పల్ నియోజకవర్గ సర్వసభ్య సమావేశంలో సీపీఐ బలపర్చిన కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మందుముల పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. సీపీఐ, కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా అభివాదం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, ఈ ఎన్నికలు అవినీతికి, అభివృద్ధి కి మధ్య జరుగుతున్న ఎన్నికలుగా ప్రజలు ఇప్పటికే సమాధానం చెప్పడానికి ఓటు అనే ఆయుధంతో సిద్ధంగా ఉన్నారని ఉద్ఘాటించారు. కార్మికులు, కర్షకులు, మహిళలు, విద్యార్థులు, యువజనులు అన్ని వర్గాల వారు బీఆర్ఎస్ ప్రభుత్వ తీరుకు విసిగిపోయారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి మందుముల పరమేశ్వర్ రెడ్డికి సీపీఐ ఉప్పల్ నియోజకవర్గం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ, ఎన్నికల ప్రచారంలో పాల్గొని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. సమావేశంలో సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి, ఉప్పల్ నియోజకవర్గ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి, ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాఘవ రెడ్డి, ఏ ఐ వై ఎఫ్ జిల్లా కార్యదర్శి టి.సత్య ప్రసాద్,సీపీఐ కాప్రా పట్టణ కార్యదర్శి లక్ష్మీ నారాయణ,సీపీఐ నియోజకవర్గ నేతలు మల్లేష్,నర్సింహా, భిక్షపతి , నర్సింగరావు,బాబు రావు, మిరియాల సాయిలు,కృపాకర్, పరమేష్, సాయిలు, రజిని, ఏఐఎస్ఎఫ్ నేతలు మహేష్, రాకేష్, దుర్గా ప్రసాద్, సద్దాంలతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## హైమావతి రెసిడెన్సి సమావేశంలో పాల్గొన్న బీఎల్ఆర్

తెలంగాణ వీణ , హైదరాబాద్ : హబ్సిగూడ డివిజన్ స్ట్రీట్ నెంబర్ 8 హైమావతి రెసిడెన్సి వారు ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ నియోజకవర్గం బి ఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి,తెలంగాణ రాష్ట్ర బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి హాజరయ్యారు . హైమావతి రెసిడెన్సి అధ్యక్షులు సీత , సెక్రెటరీ అరుణ్ కుమార్, మణికాంత్ లు ఏర్పాటుచేసిన సమావేశంలో బండారి లక్ష్మారెడ్డి ,రాగిడి లక్ష్మారెడ్డి పాల్గొని రెసిడెన్సివాసులను మద్దతు కోరడం జరిగింది దీనికి సానుకూలంగా స్పందించిన రెసిడెన్సి వాసులు తమ పూర్తి మద్దతు ఉప్పల్ నియోజకవర్గం టిఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి కి ఉంటుందని తెలియజేశారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి బండారి లక్ష్మారెడ్డి , రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గారు ప్రవేశపెట్టిన పథకాలను వివరిస్తూ గడిచిన 9 ఏళ్లలో తెలంగాణ రాష్ట్రం ఎంత అభివృద్ధి పథంలో నిలిచింది అన్నది అందరికీ తెలిసిన విషయమన్నారు, ఈ ఎన్నికల్లో ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను కరపత్ర రూపంలో పంపిణీ చేస్తూ రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు .ఈ కార్యక్రమంలో పసుల ప్రభాకర్ రెడ్డి, సంజయ్ జైన్, కాలేరు జె నవీన్, వీరేందర్, శ్యాంసుందర్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బండారి లక్ష్మారెడ్డి కి వినూత్నంగా స్వాగతం పలికిన నాచారం ఓటర్లు





తెలంగాణ వీణ, కాప్రా: ఉప్పల్ నియోజకవర్గంలో భారీ మెజారిటీతో గులాబీ జెండాను ఎగరేసే దిశగా అవిశ్రాంతంగా కష్టపడుతూ, ప్రచారంలో జోరు పెంచిన బిఆర్ఎస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీ బండారి లక్ష్మారెడ్డి, ఈరోజు నాచారం డివిజన్ లో ఇంటింటికి తిరుగుతూ, విస్తృతంగా ప్రచారం చేసారు , నాచారం ఓటర్లు జై కేసీఆర్, జై బిఎల్ఆర్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ, కేసీఆర్, బిఎల్అర్ ఫోటోలతో, సంక్షేమ పథకాల ప్లకార్డ్ లతో వినూత్నంగా స్వాగతం తెలిపారు.ఈ సందర్బంగా బండారి లక్ష్మారెడ్డి గారు మాట్లాడుతూ.నాచారం డివిజన్ రామ్ రెడ్డి నగర్ అభివృద్ధి బాధ్యత నాదంటూ, మీ అందరికీ 24 గంటలు అందుబాటులో ఉంటానని, బిఆర్ఎస్ ప్రభుత్వం గెలిచిన తర్వాత అధికారులని నావెంటే తీసుకొచ్చి, ఇక్కడ నిలబెట్టి పని చేపిస్తానని హామీనిచ్చారు. మా బిఎల్ఆర్ ట్రస్ట్ ద్వారా మీకు ఏ అవసరం వచ్చినా వెంటనే పరిష్కరిస్తానని, మీరు నాకోసం రానున్న 20 రోజులు పనిచేస్తే, మీకోసం నేను 5సంవత్సారాలు పనిచేస్తానని భరోసా ఇచ్చారు.అందరూ ఉప్పల్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ, కారు గుర్తుకు ఓటు వేసి తనని భారీ మెజారిటీతో గెలిపియ్యాలని కోరారు.ఈ ప్రచారంలో కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్, తో పాటు మహిళా కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి వలసలు



తెలంగాణవీణ, దుండిగల్ ; రానున్నది కాంగ్రెస్ పార్టేనని , రేవంత్ రెడ్డి నాయకత్వానికి ఆకర్షితులై బీఆర్ఎస్,బిజెపీలనుంచి పలువురు పార్టీలోకి చేరుతున్నారని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోలన్ హన్మంత్ రెడ్డి తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 128 చింతల డివిజన్ భగత్ సింగ్ నగర్ నుండి శ్రీనాధ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నుండి పలువురు మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరారు, ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ దళిత బంధు,బిసి బంధు,మైనార్టీ బంధు అంటూ ప్రజలను మోసం చేస్తుందనీ, రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలే తగిన బుద్ధిచెబుతారన్నారు. కేసీఆర్ మాయమాటలు నమ్మే రోజులు పోయాయని రాష్ట్రంలో ప్రజలు అభివృద్ధి తోపాటు మార్పు కోరుకుంటున్నారని అది కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమన్నారు.

## ఆ పార్టీకి ప్రజలు ఓటెందుకు వేయాలి?



తెలంగాణ వీణ , హైదరాబాద్ : ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందని ఓటు వేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం ముషీరాబాద్, అంబర్ పేటలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులతో కలిసి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..40 సంవత్సరాలు అధికారంలో ఉండి ప్రజలకు ఏం చేశారో చెప్పే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. 130 సంవత్సరాల చరిత్ర ఉన్న పార్టీ కాంగ్రెస్‌ను ఈ ఎన్నికలలో ప్రజలు బొంద పెడతారన్నారు.ఓటమి తప్పదనే భయంతోనే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి పోటీ నుంచి తప్పుకున్నారని ఎద్దేవా చేశారు. రెండు సీట్లు గెలిచిన బీజేపీ బీసీ ముఖ్యమంత్రిని ఎలా చేస్తారు? కేంద్రమంత్రిగా పార్లమెంట్ నియోజకవర్గంలో కానీ అంబర్ పేట నియోజకవర్గంలో కానీ ఎన్ని నిధులు ఖర్చు పెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. మళ్లీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది ముమ్మాటికీ బీఆర్ఎస్ ప్రభుత్వమే నని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు యధావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## AI ఫేక్ కంటెంట్ పై
# కేంద్రం కొరడా!

తెలంగాణ వీణ , జనరల్ : ఈ మధ్యకాలంలో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ వినియోగం విపరీతంగా పెరుగుతోంది. దీని ద్వారా లభించి కంటెంట్ ప్రజలకి ఎంత ఉపయోగపడుతుందో అదే స్థాయిలో దుర్వినియోగం కూడా అవుతోంది. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ తో నడిచే యాప్స్, వెబ్ సైట్స్ విపరీతంగా డిజిటల్ స్పేస్ లోకి వచ్చేశాయి. వీటిని ఉపయోగించి కొంతమంది ఫోటోలు మార్ఫింగ్ చేయడం, వీడియోలు మార్ఫింగ్ చేయడం వంటి తప్పుడు పనులు చేస్తున్నారు.ముఖ్యంగా సెలబ్రిటీలకి సంబంధించిన డీప్ ఫేక్ ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ సహాయంతో ఇప్పుడు ఇది మరింత ఈజీ అయిపోయింది. వేరొకరి పేస్ ఉన్న వీడియోని తీసుకొని దాంట్లో ఉన్న విమెన్ కి హీరోయిన్స్ పేస్ ని AI సహాయంతో డీప్ ఫేక్ లో తయారు చేస్తూ సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఆ వీడియోలు చూసిన వారు ఎవరైనా నిజంగానే ఆ సెలబ్రిటీ అని నమ్మేస్తారు. అంత పెర్ఫెక్ట్ గా డీప్ ఫేక్ టెక్నాలజీతో మార్ఫింగ్ వీడియోలు చేస్తున్నారు. తాజాగా రష్మిక మందన డీప్ ఫేక్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనిపై పెద్ద ఎత్తున సెలబ్రిటీల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. రష్మికకి అండగా నిలబడి ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ తో చేసే డీప్ ఫేక్ వీడియోలపై కఠిన చర్యలు ఉండాలని డిమాండ్ చేశారు.తాజాగా దీనిపై సెంట్రల్ ఐటీ మినిస్టర్ స్పందించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ 66లోని సెక్షన్ అనుసరించి చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేసేవారికి మూడేళ్ళ జైలు శిక్ష ఉంటుందని హెచ్చరించారు. 24 గంటల్లో కృత్రిమంగా తయారు చేసిన కంటెంట్ ని తొలగించాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు.ఈ యాక్ట్ ప్రకారం నేరం రుజువైతే మూడేళ్ళ జైలు శిక్షతో పాటుగా లక్ష రూపాయిల వరకు జరీమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు. అలాగే రష్మిక డీప్ ఫేక్ వీడియో క్రియేట్ చేసిన వారిపైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రష్మిక వీడియో గురించి ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చ నడుస్తూ ఉండగానే సైబర్ కేటుగాళ్ళు కత్రినా కైఫ్ డీప్ ఫేక్ వీడియో కూడా మార్ఫింగ్ చేసి షేర్ చేయడం గమనార్హం.

## స్టీల్ ప్లాంట్‌పై వైసీపీ ఎంపీలవి సన్నాయి నొక్కులు



తెలంగాణ వీణ , జనరల్ : విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేపట్టిన ఉద్యమం వెయ్యి రోజులకు చేరుకుంది. ఈ ఉద్యమానికి మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు , బండారు, మాజీ ఎమ్మెల్యే పళ్ళ. ఎమ్మెల్సీలు, ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్, కాంగ్రెస్, జనసేన పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పోరాటాలు ద్వారా సాధించుకున్న పరిశ్రమ విశాఖ స్టీల్ ప్లాంట్ అని.. 32 మంది ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం ఎన్నికలు పక్కన పెట్టి పోరాడాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం తాను రాజీనామా చేశానని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి స్టీల్ ప్లాంట్ విషయంలో విఫలం అయ్యారని విమర్శించారు. వైసీపీ ఎంపీలు స్టీల్ ప్లాంట్ కోసం ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. వైసీపీ ఎంపీలు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలకు ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. ముఖ్యమంత్రి ఒకసారి కూడా ఉక్కు కార్మికుల దీక్షా శిబిరానికి వచ్చి సంఘీభావం తెలియజేయలేదని గంటా శ్రీనివాసరావు విమర్శలు గుప్పించారు.విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం ఎందరో పోరాటం చేశారన్నారు. తాను స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం న్యాయం పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. స్టీల్ ప్లాంట్ భూములు రియల్ ఎస్టేట్ కోసం అమ్ముకుంటున్నారన్నారు. ‘‘నా మీద కేసు పెట్టే దమ్ము ఉందా. విశాఖ ఎంపీగా నన్ను గెలిపించండి. నాకు జేడీ లక్ష్మీనారాయణ పూర్తి మద్దతు ఇవ్వనున్నారు. పార్లమెంటులో ఒక ఊపు, ఊపుతాను’’ అంటూ కేఏపాల్ పేర్కొన్నారు.

## విజయసాయిరెడ్డి వ్యాఖ్యలను తప్పుపట్టిన సోమిరెడ్డి



తెలంగాణ వీణ, జనరల్ : వైసీపీ రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డిపై టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి సోమిరెడ్డి తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు. ఏం అర్హత ఉందని సాయి రెడ్డి పురందేశ్వరిపై వ్యాఖ్యలు చేస్తున్నారని, విజయ సాయి రెడ్డి ఒక నటోరియస్ క్రిమినల్ అంటూ సోమిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. "విజయసాయిరెడ్డి ఎందుకు పురందేశ్వరిపై రెచ్చిపోతున్నారు. పురందేశ్వరి ఎన్టీఆర్ కుమార్తె. కేంద్ర మంత్రిగా పురందేశ్వరి 9 ఏళ్ళు పనిచేశారు. విజయసాయిరెడ్డి ఏ2గా మాత్రమే ప్రజలకు తెలుసు. సాయిరెడ్డికి సంస్కారం లేదు. ఆడిటర్ గా జగన్ కి పిచ్చి సలహాలు ఇచ్చి క్విడ్ ప్రోకో నేర్పించి జగన్ ను జైలుకు పంపారు. తను జైలుకు పోయారు. పురందేశ్వరి బయటపెట్టిన అవినీతిపై దమ్ము ఉంటే సమాధానం చెప్పాలి." అని సోమిరెడ్డి డిమాండ్ చేశారు.

# బీఎల్ఆర్ కి మద్దతుగా మహిళ ఆత్మీయ సమ్మేళనం



తెలంగాణ వీణ, ఉప్పల్ : ఉప్పల్ నియోజకవర్గం, మల్లాపూర్ డివిజన్, వియన్ఆర్ గార్డెన్స్లో బీఆ ర్ఎస్ ఉప్పల్ నియోజక ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మా రెడ్డి కి మద్దతుగా మహిళ ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వైద్య,ఆరోగ్య ఆర్థిక శాఖ మంత్రివర్యులు హరీష్ రావు ముఖ్యఅతిథిగా విచ్చేసారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపుర్ రాజు ,ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి, ఎన్నికల ఇంచార్జ్ రావుల శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర సీనియర్ నాయ కులు రాగిడి లక్ష్మారెడ్డి, సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, పలువురు బిఅర్ఎస్ మహిళా కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు, దాదాపు 5000 మంది పార్టీ మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ భాస్కర్ రెడ్డికి మధ్యంతర బెయిల్

తెలంగాణ వీణ , జనరల్ : వివేకా హత్య కేసుకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న వైఎస్ భాస్కర్ రెడ్డికి సీబీఐ కోర్టు తాజాగా మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. నవంబర్ 30 వరకూ బెయిల్ మంజూరు చేసిన న్యాయస్థానం డిసెంబర్ 1న 10.30 గంటలకు చంచల్‌గూడ్ జైలుకు వెళ్లాలని ఆదేశించింది. కోర్టులో తన పాస్‌పోర్టును సరెండర్ చేయాలని కూడా భాస్కర్ రెడ్డిని కోర్టు ఆదేశించింది. తన చిరునామా వివరాలను కోర్టు, సీబీఐకి ఇవ్వాలని పేర్కొంది. ఇక చికిత్సకు వెళ్లాల్సి వస్తే ఆ వివరాలను కూడా సీబీఐకి తెలపాలని స్పష్టం చేసింది. కుటుంబసభ్యులను తప్ప మిగతా ఎవ్వరినీ కలవొద్దని కూడా ఆయనను కోర్టు ఆదేశించింది. సెప్టెంబర్ 20న వైఎస్ భాస్కర్ రెడ్డికి ఎస్కార్ట్ బెయిల్‌పై మంజూరైన విషయం తెలిసిందే. ఈ బెయిల్‌ను ఇంటరిమ్ బెయిల్‌గా మారుస్తూ సీబీఐ కోర్టు ఆదేశాలు జారీ చేసింది.




## రాష్ట్రంలో నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం

తెలంగాణ వీణ , జనరల్ : రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆగ్నేయ అరేబియా సముద్రం, లక్షద్వీప్ ప్రాంతం నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం మధ్య అల్పపీడన ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో దక్షిణ భారతదేశంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. తెలంగాణ, ఏపీ, కేరళ, తమిళనాడు, కర్నాటక, అండమాన్ నికోబార్ దీవుల్లో వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈశాన్య రుతుపవనాల కారణంగా తెలంగాణలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తారు వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. వచ్చే నాలుగు రోజులు హైదరాబాద్, మహబూబ్‌నగర్, వికారాబాద్, నల్లగొండ, సూర్యాపేట, నారాయణ పేట, రంగారెడ్డి జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెప్పారు. మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లోనూ అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని తెలిపారు.

## బాలానగర్‌లో 52.50 లక్షల నగదు సీజ్ చేసిన పోలీసులు

తెలంగాణవీణ, దుండిగల్ ; బాలానగర్‌లో ఎస్ఓటి పోలీసులు, బాలానగర్ పోలీసులు సంయుక్తంగా వాహనాల తనిఖీ చేస్తుండగా బాలానగర్ శోభన బస్టీప్ సమీపంలో ఓ వాహనంలో 52.50 లక్షలు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. రాత్రి రెండు గంటల ప్రాంతంలో వాహనంలో తరలిస్తున్న 52.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని, దానికి సంబంధించిన ఎటువంటి పత్రాలు చేపించక పోవడంతో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి తరలిస్తున్న డబ్బును సీజ్ చేయడం జరిగిందని సీఐ భాస్కర్ తెలిపారు. ఎవరైన తమ వద్ద 50 వేలకు మించి నగదును తీసుకు వెళ్లవద్దని, ఒక వేళ తీసుకు వెళ్లాల్సి వస్తే దానికి సంబంధించిన రసీదులు, పత్రాలు దగ్గర పెట్టుకోవాలని సూచించారు.




### మైనంపల్లి పైసల మైనాన్ని
## ఓటుతో కరిగించాలి



తెలంగాణ వీణ , హైదరాబాద్ : మైనంపల్లి హన్మంతరావు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని, ఆయనలా తాను దిగజారి మాట్లాడలేనని మంత్రి హరీశ్ రావు అన్నారు. మల్కాజిగిరిలో నిర్వహించిన బీఆర్ఎస్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ... మల్కాజిగిరిలో మంచితనానికి, రౌడీయిజానికి మధ్య పోటీ జరుగుతోందన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖరరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి పైసల మైనాన్ని ఇక్కడి ప్రజలు తమ ఓటుతో కరిగించాలన్నారు.మల్కాజిగిరి నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేసుకోవాలంటే కేసీఆర్ ప్రభుత్వం మళ్లీ రావాలన్నారు. గతంలో కాంగ్రెస్ నేతలు ముఖ్యమంత్రి పదవి కోసం హైదరాబాద్‌లో మతకల్లోహాలు సృష్టించారన్నారు. కానీ కేసీఆర్ పాలనలో హైదరాబాద్ సహా తెలంగాణ ఎంతో ప్రశాంతంగా ఉందన్నారు. హైదరాబాద్ ఇలాగే ప్రశాంతంగా ఉండాలంటే కారు గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు.

### మరోసారి ఏపీ ప్రభుత్వాన్ని
## టార్గెట్ చేసిన పురంధేశ్వరి




తెలంగాణ వీణ , జనరల్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మరోసారి టార్గెట్ చేసి ఆరోపణలు గుప్పించారు ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి.. కోడుమూరు పర్యటనలో ఉన్న ఆమె.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతుభరోసా నిధులలో కేంద్ర వాటాను కూడా తన వాటాగా వైఎస్ జగన్ ప్రచారం చేసుకుంటున్నారు అని దుయ్యబట్టారు.. సిల్వర్ జూబ్లీ, ట్రిపుల్ ఐటీ కళాశాలలకు కేంద్రం నిధులు మంజూరు చేస్తే .. ఇప్పటి వరకు కనీస సౌకర్యాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయ్యిందని విమర్శించారు. ఇక, శ్రీశైలం డ్యాం మరమ్మత్తులకు కేంద్రం విడుదల చేసిన 720 కోట్ల రూపాయలలో ఎంతమేర పనులు చేశారో చెప్పాలి..? అంటూ సవాల్ చేశారు. జిల్లాలో వలసల నివారణలో జగన్ ప్రభుత్వం విఫలం అయ్యిందని దుయ్యబట్టారు. వలస నివారణకు ఉపాధి హామీ నిధులను సీఎం వైఎస్ జగన్ పక్కదారి పట్టించడం వాస్తవం కాదా? అని నిలదీశారు. ఇక, ఎన్నికలపుడు రైతులు పండించిన పంటలకు మద్దతు ధర స్థిరీకరణ కోసం ఫండ్ ఏర్పాటు చేస్తానని హామి ఇచ్చారు.. కానీ, జగన్ తర్వాత మాటతప్పడం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఏటా కేంద్రం ఇచ్చిన 350 కోట్ల రూపాయల నిధులు జగన్ జేబులోకి వెళ్తున్నాయి.. జిల్లాలో సాగు, తాగు, నీటి ప్రాజెక్టులు ఏర్పాటు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయ్యిందంటూ విమర్శలు గుప్పించారు దగ్గుబాటి పురంధేశ్వరి..

### కేసీఆర్ ప్రభుత్వం వచ్చినప్పుడు
## ఆ అనుమానం ఉండేది



తెలంగాణ వీణ , హైదరాబాద్ : పదేళ్ల క్రితం కేసీఆర్ ప్రభుత్వం వచ్చినప్పుడు వీరికి పరిపాలన సాధ్యమవుతుందా? అని ఎన్నో అనుమానాలు ఉండేవని, ఇప్పుడు తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా ఎదిగిందని మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సోమాజిగూడలోని ఓ హోటల్లో నగరానికి చెందిన పలువురు పారిశ్రామికవేత్తలతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ తొమ్మిదిన్నరేళ్లలో చూసింది కేవలం ట్రయలర్ మాత్రమేనని, మూడోసారి అధికారంలోకి వచ్చాక అయిదేళ్లలో 24 గంటలు తాగునీరు సదుపాయం కల్పిస్తామన్నారు.పదేళ్ల క్రితం పది రోజులు కరెంట్ పోయినా అడిగేవారు లేరని, ఇప్పుడు పది నిమి షాలు పోతేనే... ఇదేనా బం గారు తెలంగాణ? అని అడుగుతున్నారన్నారు. కర్ణాటక నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు వచ్చి తాము ఐదు గంటల విద్యుత్ ఇస్తున్నామని చెబుతున్నారని, కానీ ఇక్కడ తెలంగాణలో 24 గంటల విద్యుత్ ఇస్తున్న విషయం మరిచిపోయారన్నారు. దేశంలో అత్యధిక తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రం తెలంగాణ అన్నారు.కొత్త పరిశ్రమలకు ఇచ్చినట్లుగా పాత పరిశ్రమలకు కూడా రాయితీలు ఇవ్వాలని మంత్రి కేటీఆర్‌ను పలువురు పారిశ్రామికవేత్తలు కోరారు. మళ్లీ బీఆర్ఎస్ రావాలని, ఆ తర్వాత మన డిమాండ్లను నెరవేర్చుకోవాలని పారిశ్రామికవేత్తలు పిలుపునిచ్చారు. తెలంగాణ వచ్చాక ఇండస్ట్రీ నడపడం గతంలో కంటే సులభమైందన్నారు. పారిశ్రామికరంగం అభివృద్ధి చెందాలంటే కేసీఆర్ మూడోసారి సీఎం కావాలన్నారు. తగినంత విద్యుత్ అందుబాటులో ఉండటం వల్లే పారిశ్రామికాభివృద్ధి సాధ్యపడిందన్నారు.







## 12 యాక్షన్ సీక్వెన్సులతో టైగర్ 3

తెలంగాణ వీణ, సినిమా : బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్, కత్రినా కైఫ్ హీరో హీరోయిన్లుగా ప్రముఖ నిర్మాణ సంస్థ యష్ రాజ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై ఆదిత్య చోప్రా నిర్మిస్తోన్న భారీ చిత్రం 'టైగర్ 3' థియేటర్లలో రిలీజ్ అయ్యేందుకు సిద్ధం అవుతోంది. అయితే మనీష్ శర్మ దర్శకత్వంలో తెర కెక్కుతోన్న ఈ చిత్రం అత్యధిక యాక్షన్ సీక్వెన్సు లున్న చిత్రంగా సరికొత్త రికార్డ్‌ను క్రియేట్ చేసింది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు మనీష్ శర్మ మాట్లాడుతూ "'టైగర్ 3'లో ఇండియన్ సిల్వర్ స్క్రీన్ బిగ్గెస్ట్ యాక్షన్ పెయిర్లో టైగర్ పాత్రలో సల్మాన్ ఖాన్, జోయా పాత్రలో కత్రినా కైఫ్ నటించారని, ఇది వారిద్దరి కథని అన్నారు. వారిద్దరూ కలిసినప్పుడు సంఘర్షణ ఉంటూనే వస్తుందని, వారి మధ్య బంధం పెరిగే కొద్దీ ఈ సంఘర్షణ పెరిగింది కానీ తగ్గలేదని టైగర్ 3లో ఈ సంఘర్షణ ఇంకా బలంగా కనిపించనుందని అన్నారు.అందుకు తగినట్లు యాక్షన్ సన్నివేశాలు మెప్పించనున్నాయని, హాలీవుడ్ యాక్షన్ సినిమాలకు ధీటుగా టైగర్ 3లో సన్నివేశాలు మెప్పించనున్నాయని అన్నారు. ఈ సినిమాలో సల్మాన్, కత్రినా పాత్రలు ఎదుర్కొనే సమస్యల్లో ఉండే తీవ్రత వల్ల సినిమా చాలా వేగవంతంగా సాగుతుందని, ముఖ్యంగా ఈ మూవీలో 12 అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలున్నాయ, ఇవి ప్రేక్షకులు సీట్ ఎడ్జ్‌లో కూర్చొనిపెట్టి చూసేలా చేస్తాయని ఆయన అన్నారు. ఇక అద్భుతమైన క్లైమాక్స్ ఉంటుందని, టైగర్, జోయా ఫ్యాన్స్‌కైతే ఇదొక ట్రీట్‌లా ఉంటుంది, ఐమ్యాక్స్‌లో ఈ యాక్షన్ సీన్స్ అబ్బురపరుస్తాయి" అన్నారు. యష్ రాజ్ ఫిలిమ్స్ స్పై యూనివర్స్‌లో భాగంగా రూపొందుతోన్న టైగర్ 3 నవంబర్ 12న దీపావళి సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా హిందీ, తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్ రిలీజ్ కానుంది..

### ఝాన్సీ పర్సనల్ సెక్రటరీ శ్రీనుబాబు
## కార్డియాక్ అరెస్ట్‌తో మృతి

తెలంగాణ వీణ, సినిమా : తొలితరం బుల్లితెర యాంకర్‌గా ప్రేక్షకులకు దగ్గరైన ఝాన్సీ ఆ తర్వాత సినిమాల్లోనూ నటించి మెప్పించారు. ప్రస్తుతం ఇటు బుల్లితెర, అటు సినిమాలకు కాస్తంత దూరంగా ఉన్న ఆమె తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ విషాదకర పోస్టు పెట్టారు. తన వద్ద పనిచేసే శ్రీను అనే వ్యక్తిగత సహాయకుడు (పర్సనల్ సెక్రటరీ) 35 ఏళ్ల చిన్న వయసులోనే కార్డియాక్ అరెస్ట్‌తో మరణించాడని చెబుతూ విచారం వ్యక్తం చేశారు. శ్రీను, శ్రీనుబాబు అని తాను అతడిని ముద్దుగా పిలుచుకునేదానినని, అతడే తన మెయిన్ సపోర్ట్ సిస్టం అని పేర్కొన్నారు. తన వద్ద హెయిర్ స్టైలిస్ట్‌గా చేరి పర్సనల్ సెక్రటరీ స్థాయికి ఎదిగాడని తెలిపారు. సున్నిత మనస్తత్వం కలిగిన శ్రీను తన స్టాఫ్ కంటే ఎక్కువని, తనకు తమ్ముడు లాంటివాడని పేర్కొన్నారు. అతడు తన బలమని, అతడే తన ఉపశమనమని తెలిపారు. గ్రాడ్యుయేట్ అయిన అతడు తన పనులను చక్కగా నిర్వర్తించేవాడని ప్రశంసించారు. తానిప్పుడు చాలా బాధలో ఉన్నానని, మాటలు కూడా రావడం లేదన్నారు. జీవితం ఒక బుడగలాంటిదని చెబుతూ ముగించారు. ఈ పోస్టు చూసిన వారు అతడి ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షిస్తూ కామెంట్లు పెడుతున్నారు.



## ట్రీట్మెంట్ అనంతరం ఇండియాలో ల్యాండ్ అయ్యిన ప్రభాస్




తెలంగాణ వీణ, సినిమా : ప్రస్తుతం పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా శృతి హాసన్ హీరోయిన్ గా దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్ లో తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం "సలార్" కోసం అందరికి తెలిసిందే. ఇప్పుడు ఇండియన్ సినిమా దగ్గర ఒక మోస్ట్ అవైటింగ్ రిలీజ్ గా రాబోతుండగా ఈ చిత్రం ఈ చిత్రం షూట్ అంతా కంప్లీట్ అయ్యాక ప్రభాస్ ఎప్పటి నుంచో బాధపడుతున్న తన మోకాలి సమస్యకి ఇటలీలో సర్జరీ చేయించుకున్నాడు.అయితే రాధే శ్యామ్, ఆది పురుష్ చిత్రాల సమయంలో కాళీ నొప్పితో స్ట్రగుల్ అయ్యిన ప్రభాస్ సలార్ ని కంప్లీట్ చేసి ట్రీట్మెంట్ తీసుకున్నాడు. అయితే ఈ ట్రీట్మెంట్ అనంతరం తాను ఇటలీ లోనే రెండు నెలల పాటుగా రెస్ట్ తీసుకోవాల్సి వచ్చింది. దీనితో అప్పుడే ప్రభాస్ నవంబర్ కి అలా ఇండియాలో ల్యాండ్ అవుతాడు అని తెలిసింది. మరి ఇప్పుడు అనుకున్నట్టే ఇండియాలో ఫైనల్ గా ఫైనల్ గా హెల్తీగా అయితే తాను అడుగు పెట్టాడు. దీనితో ప్రభాస్ లేటెస్ట్ పిక్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి.

## భగవంత్ కేసరిపై ఆ హీరోయిన్ సంచలన వ్యాఖ్యలు

తెలంగాణ వీణ, సినిమా : ఈ మధ్య కాలంలో బాలకృష్ణ హీరోగా నటించిన భగవంత్ కేసరి సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్ తెచ్చుకున్న సంగతి తెలిసిందే. అనిల్ రావిపూడి డైరెక్షన్లో తెరకెక్కిన సినిమాలో కాజల్ అగర్వాల్ హీరోయిన్ గా నటించగా ఒక కీలక పాత్రలో శ్రీ లీల నటించింది. ఈ సినిమాలో ప్రస్తావించిన గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అనే కాన్సెప్ట్ అయితే బాగా ప్రేక్షకుల్లోకి చొచ్చుకు వెళ్ళింది. ఇక తాజాగా అదే అంశం మీద ఒకప్పటి హీరోయిన్ మాదవి లత సంచలన వ్యాఖ్యలు చేసింది. స్నేహితుడా, నచ్చావులే లాంటి సినిమాలతో హీరోయిన్ గా నిలదొక్కుకున్న మాధవి ఎందుకో తరువాత ఆ స్థాయిలో సినిమాలు చేయలేకపోయింది. సినిమాలు కూడా లేకపోవడంతో బీజేపీలో చేరి ఎమ్మెల్యేగా కూడా పోటీ చేసి డిపాజిట్లు కోల్పోయిన ఆమె తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది.హీరోల చేత గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి చెప్పించడం చాలా మంచి విషయం అని పేర్కొన్న ఆమె హీరోయిన్ పాత్రని గ్లామర్ కి పరిమితం చేసి హీరో చేత ఇలాంటి డైలాగులు చెప్పించకూడదు ఆ విషయంలో భగవంత్ కేసరి చిత్రంలో శ్రీలీల పాత్ర చాలా బావుందని నేను విన్నానని ఆమె అన్నారు. అలా చేయకపోతే చేసేది శివ పూజ దూరేది ఇంకేదో అన్నట్లుగా ఉంటుందని మాధవీలత పేర్కొంది. అలాగే ఆమె మాట్లాడుతూ డైలాగులు చెప్పడం వరకే కాదు, ఆ డైలాగులు చెప్పే వారు రియల్ లైఫ్ లో కూడా పాటిస్తే మంచిది అంటూ మాధవీలత పేల్చిన ఒక సెటైర్ హాట్ టాపిక్ అవుతోంది. మళ్ళీ హరహర దేవా మళ్ళీ చేసేది శివపూజలు దూరేది ఇంకేదో అనిపించేలా ఉండకూడదని ఆమె చెప్పుకొచ్చారు. ఆమె నేరుగా ఎవరినీ విమర్శించకపోయినా బాలకృష్ణను పరోక్షంగా విమర్శించినట్టు అనిపిస్తోందని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. మీ ఉద్దేశం ఏంటో కామెంట్ చేయండి.

## తప్పుడు ప్రచారం చేస్తున్నారు: అనసూయ



తెలంగాణ వీణ, సినిమా : సినీ నటి, బుల్లితెర యాంకర్ అనసూయ ఎప్పుడూ ఏదో ఒక వివాదంలో ఉంటూ, వార్తల్లో నిలుస్తూ ఉంటారు. ఈ క్రమంలో ఆమె విపరీతమైన ట్రోలింగ్ ను కూడా ఎదుర్కొంటుంటారు. తాజాగా ఆమె మరో వివాదంలో చిక్కుకున్నారు. వివరాల్లోకి వెళ్తే... ఓ యూట్యూబ్ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అల్లు అర్జున్ గురించి మాట్లాడుతున్న సమయంలో... ఆమె అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ వార్తలు వైరల్ అవుతున్నాయి. సోషల్ మీడియాలో ఫ్యాన్స్ నుంచి తన డ్యాన్స్ గురించి అల్లు అర్జున్ ఫీడ్ బ్యాక్ తీసుకుంటారని... ఏవైనా తప్పులుంటే తన నెక్స్ట్ మూవీలో ఆ తప్పులను సరిచేసుకుంటారని 'పుష్ప' సినిమాలో కొన్ని మిస్టేక్స్ చేశాడని, 'పుష్ప2' సినిమాలో ఆ తప్పులు జరగకుండా చూసుకుంటున్నాడని ఆమె చెప్పినట్టుగా వార్తలు వచ్చాయి. దీంతో, అనసూయపై బన్నీ ఫ్యాన్స్ మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో అనసూయ స్పందించింది. తాను అల్లు అర్జున్ గురించి ఇలాంటి వ్యాఖ్యలు చేయలేదని చెప్పింది. తన మాటలను వక్రీకరించారని, తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది.

## ఒంటికాలిపైనే మ్యాక్సీ ఊచకోత



తెలంగాణ వీణ , క్రీడలు : వరల్డ్‌కప్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా బ్యాటర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ ఓ వండర్ సృష్టించాడు. తన పవర్‌గేమ్‌తో కేక పుట్టించాడు. ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను డబుల్ సెంచరీ చేసి ఆసీస్‌కు స్టన్నింగ్ విక్టరీ అందించాడు. వ్యక్తిగతంగా 147 రన్స్ వద్ద ఉన్నప్పుడు అతని తొడ కండరాలు పట్టేశాయి. పరుగు తీయబోయి కిందపడిపోయాడు. భరించలేని నొప్పితోనే అతను బ్యాటింగ్ చేశాడు. ఇన్నింగ్స్‌లో 35వ సింగిల్ తీసిన సమయంలో.. మ్యాక్స్‌వెల్ కండరాలు పట్టేశాయి.అసలు ఇక ఆడుతాడో లేదో అన్న పరిస్థితి అతనిది. నడుము కింది భాగం బిగుతుగా పట్టేయడంతో ఓ దశలో మ్యాక్స్‌వెల్ తల్లడిల్లిపోయాడు. జట్టుకు విజయాన్ని అందించాలన్న దీక్షతోనే బ్యాటింగ్ చేశాడు. ఆస్ట్రేలియా ఫిజియోథెరపిస్టు నిక్ జోన్స్ వార్నింగ్ ఇచ్చినా అతను పట్టించుకోలేదు. బైరన్నర్‌గా వచ్చేందుకు ఆడమ్ జంపా రెడీగా ఉన్నా.. మ్యాక్సీ మాత్రం తన స్టయిల్‌లోనే ఆడేశాడు.తొడకండలు పట్టేసినా.. మ్యాక్స్‌వెల్ మాత్రం పట్టువీడలేదు. ఒంటికాలిపైనే వత్తిడి పెంచేసి రకరకాల షాట్లతో చెలరేగిపోయాడు. ఇంత వెరైటీగా కూడా షాట్లు కొట్టవచ్చా అన్న రీతిలో దంచేశాడు. సింగిల్స్ తీయడం తగ్గించిన మ్యాక్సీ.. ఆ సమయంలో భారీ షాట్లతో ఊగిపోయాడు. కండరాలు పట్టేసిన తర్వాత ఆరు ఓవర్లలో ఆరు ఫోర్లు, అయిదు సిక్సర్లు కొట్టేశాడు. విధ్వంసకర రీతిలో ఆఫ్ఘన్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. సింపుల్ స్టయిల్‌లోనే సిక్సర్లను బాదేశాడు.



## వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో లెజెండ్స్ లీగ్ క్రికెట్ కప్ ప్రయాణం..!

తెలంగాణ వీణ , క్రీడలు : లెజెండ్స్ లీగ్ క్రికెట్ రెండో ఎడిషన్ ఈ నెల 18న ప్రారంభం షురూ కానున్నది. డిసెంబర్ 9 వరకు కొనసాగనున్నది. వెటరన్ క్రికెట్ మరోసారి మైదానంలోకి దిగి క్రికెట్ అభిమానులను అలరించబోతున్నారు. దేశంలోని ఐదు నగరాల్లో టోర్నీ సాగనున్నది. ఇందులో జమ్మూ, రాంచీ, డెహ్రాడూన్, వైజాగ్, సూరత్ ఉన్నాయి. అయితే, భారత్‌లో క్రీడలను మరింత ప్రోత్సహించేందుకు వందే భారత్‌తో లెజెండ్స్ లీగ్ భాగస్వామ్యం కుదురుకున్నది.ఇందులో భాగంగా వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో లెజెండ్స్ క్రికెట్ కప్ బుధవారం నుంచి 17 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ప్రయాణించనున్నది. దాదాపు పక్షం రోజుల పాటు నార్త్, సౌత్, సెంట్రల్, ఈస్ట్, వెస్ట్ రైల్వేజోన్ల మీదుగా వందే భారత్ రైలు ప్రయాణించనున్నది. వందేభారత్‌కు, దిగ్గజ ఆటగాళ్లను స్వాగతిస్తున్నామని, దేశవ్యాప్తంగా క్రీడలను ప్రోత్సహించే ఈ అద్భుతమైన ప్రయాణం కోసం ఎదురుచూస్తున్నట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.లెజెండ్స్ లీగ్ క్రికెట్ కమిషనర్ రవిశాస్త్రి మాట్లాడుతూ భారతీ రైల్వేతో భాగస్వామ్యం కావడం, క్రీడల ప్రోత్సాహానికి దోహదపడడం గర్వకారణమన్నారు. లీగ్ సీఈవో రామన్ రహేజా మాట్లాడుతూ అభిమానులకు అత్యుత్తమ క్రీడా అనుభవాన్ని అందించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. దేశంలోని ప్రతి మూలల్లో క్రీడా సంస్కృతిని పెంపొందించడానికి ఇది ఒక ప్రత్యేకమైన కార్యక్రమమన్నారు.ఇదిలా ఉండగా.. ఈ నెల 18న లెజెండ్స్ లీగ్ టోర్నమెంట్ మొదలుకానుండగా.. ఆరు జట్లు పాల్గొంటాయి. ఇందులో ఇండియా క్యాపిటల్స్, మణిపాల్ టైగర్స్, గుజరాత్ జెయింట్స్, అర్బన్ రైజర్స్ హైదరాబాద్, సదరన్ సూపర్ స్టార్స్, భిల్వారా కింగ్స్ జట్లు పోటీ పడనున్నాయి. ఇందులో గౌతమ్ గంభీర్, సురేష్ రైనా, ఇర్ఫాన్ పఠాన్, క్రిస్ గేల్, కెవిన్ పీటర్సన్, ఎస్ శ్రీశాంత్, పార్థివ్ పటేల్, షేన్ వాట్సన్, ప్రవీణ్ కుమార్, ఝులన్ గోస్వామి తదితర దిగ్గజ క్రికెటర్లు భాగస్వాములు కానున్నారు.

## మ్యాక్స్‌వెల్ అజేయ డబుల్ సెంచరీపై వసీం అక్రమ్ స్పందన



తెలంగాణ వీణ , క్రీడలు : ఆఫ్ఘనిస్థాన్‌పై అజేయ డబుల్ సెంచరీతో తన జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించిన ఆస్ట్రేలియా స్టార్ బ్యాట్స్‌మెన్ గ్లేన్ మ్యాక్స్‌వెల్‌పై ప్రశంసల జల్లు కురుస్తోంది. తాజాగా పాకిస్థాన్ మాజీ దిగ్గజం వసీం అక్రమ్ స్పందించాడు. ఏమాత్రం నమ్మశక్యం కాని ఇన్నింగ్స్ ఇది అని అక్రమ్ వ్యాఖ్యానించాడు. వన్ మ్యాన్ షో చేశాడని, దిగ్గజాల ఆట ఆడాడని అక్రమ్ పొగిడాడు. పాకిస్థాన్ స్పోర్ట్స్ ఛానెల్ 'ఏ' స్పోర్ట్స్‌తో మాట్లాడుతూ అక్రమ్ ఈ వ్యాఖ్యలు చేశాడు. ఒకే వ్యక్తి మ్యాచ్ గెలిపించడం కష్టమనే సామెత ఉందని, అది అబద్ధమని తేలిపోయిందని వ్యాఖ్యానించాడు. నమ్మలేని పరిస్థితి నుంచి ఒక వ్యక్తి మ్యాచ్‌ను గెలిపించగలడని చూశామని మ్యాక్స్‌వెల్‌పై ప్రశంసల జల్లు కురిపించాడు. జట్టు సంక్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఆడాలనే గొప్ప సంకల్పం ఉండాలని, ఆ పరిస్థితి ఎంత కఠినంగా ఉంటుందో దిగ్గజాలను అడిగితే తెలుస్తుందని వసీం అక్రమ్ వ్యాఖ్యానించాడు. మ్యాక్స్‌వెల్‌కు అవగాహనతో చక్కటి భాగస్వామ్యం అందించిన ఆసీస్ కెప్టెన్ పాట్ కమ్మిన్స్‌ను కూడా మెచ్చుకోవాలని అక్రమ్ అన్నాడు. 68 బంతులను ఎదుర్కొన్నాడని, మ్యాక్స్‌వెల్‌కి స్ట్రయికింగ్ ఇచ్చి సహకరించాడని అన్నాడు. తన 40 ఏళ్ల క్రికెట్‌లో ఇలాంటి ఇన్నింగ్స్‌ను ఎప్పుడూ చూడలేదని వసీం అక్రమ్ పేర్కొన్నాడు. కాగా మంగళవారం ముంబైలోని వాంఖడే స్టేడియంలో 292 పరుగుల రికార్డును ఛేదించే క్రమంలో ఆస్ట్రేలియా 91 పరుగులకు 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. ఈ సమయంలో బ్యాటింగ్‌కు వచ్చిన గ్లెన్ మాక్స్‌వెల్ డబుల్ సెంచరీ కొట్టి జట్టుని గెలిపించిన విషయం తెలిసిందే.

## మ్యాచ్ మధ్యలో వార్నర్-రషీద్‌ఖాన్ మధ్య వాగ్వివాదం



తెలంగాణ వీణ , క్రీడలు : ప్రపంచకప్‌లో భాగంగా గతరాత్రి ఆఫ్ఘనిస్థాన్–ఆస్ట్రేలియా మధ్య థ్రిల్లింగ్ మ్యాచ్ జరిగింది. తొలుత ఆఫ్ఘనిస్థాన్ చేతుల్లోకి వెళ్లిపోయిన మ్యాచ్‌ను మ్యాక్స్‌వెల్ మైదానంలో విధ్వంసం సృష్టించి లాగేసుకున్నాడు. మ్యాక్సీ వన్‌మ్యాన్ షోగా మారిపోయిన ఈ మ్యాచ్‌లో ఆసీస్ ఓపెనర్ డేవిడ్ వార్నర్, ఆఫ్ఘనిస్థాన్ స్టార్ బౌలర్ రషీద్‌ఖాన్ మధ్య మైదానంలో వాగ్వివాదం జరిగింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ టీమ్మేట్స్ అయిన ఇద్దరూ గొడవకు దిగారు. ఇద్దరూ అరుచుకోవడంతో ఏం జరుగుతోందోనని అభిమానులు కంగారుపడ్డారు. అయితే, ఆ తర్వాత వారిద్దరూ ఎవరిదారిన వారు వెళ్లిపోవడంతో స్టేడియంలోని ప్రేక్షకులు ఊపిరి పీల్చుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 291 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఆస్ట్రేలియా 91 పరుగులకే 7 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. దీంతో మ్యాచ్ ఆఫ్ఘనిస్థాన్‌వైపు మొగ్గింది. అయితే, మ్యాక్స్‌వెల్ దిగాక మ్యాచ్ స్వరూపం మారిపోయింది. ఒంటిచేత్తో మ్యాచ్‌ను గెలిపించడమే కాదు.. అజేయ డబుల్ సెంచరీ (201) సాధించి అత్యంత వేగంగా ఆ ఘనత సాధించిన క్రికెటర్‌గా రికార్డులకెక్కాడు.



## నెంబర్ వన్ బ్యాటర్ గిల్.. నెంబర్ వన్ బౌలర్ సిరాజ్

తెలంగాణ వీణ , క్రీడలు : ఇండియన్ బ్యాటర్ శుభమన్ గిల్, బౌలర్ మహమ్మద్ సిరాజ్‌లు.. ఐసీసీ ర్యాంకింగ్స్(ICC Rankings)లో టాప్ ప్లేస్ కొట్టేశారు. బ్యాటింగ్‌లో గిల్, బౌలింగ్‌లో సిరాజ్‌లు నెంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. తాజాగా ఐసీసీ తన ర్యాంకుల జాబితాను రిలీజ్ చేసింది. చాన్నాళ్లుగా బ్యాటింగ్‌లో టాప్‌లో ఉన్న బాబర్ ఆజమ్ ర్యాంకు పడిపోయింది. బాబర్‌ను వెనక్కి నెట్టేసి.. గిల్ తొలి స్థానాన్ని చేజిక్కించుకున్నాడు. ఇటీవల మంచి ఫామ్‌లో ఉన్న గిల్.. ఆ స్థానాన్ని ఆక్రమించిన నాలుగవ ఇండియన్ బ్యాటర్‌గా నిలిచాడు. గతంలో సచిన్ టెండూల్కర్, ఎంఎస్ ధోనీ, విరాట్ కోహ్లీ మాత్రమే నెంబర్ వన్ బ్యాటర్ స్థానాన్ని ఆక్రమించారు.